విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

గురువారం 07 నవంబరు 2024 8 పేజీలు

కూటమిలో ఏం జరుగుతోంది ?

- ఎమ్మెల్యేల మాట బేఖాతరు
- గాడిన పడని పరిపాలన
- సమన్వయలోపం
- ఇన్‌చార్జి మంత్రి వద్ద గోడు

విశాలాంధ్ర బ్యూరో ఏలూరు: కూటమి పాలనలో ఏం జరుగుతోందన్న చర్చ మొదలైంది. అధికారులకు, ప్రజాప్రతినిధులకు మధ్య సమన్వయం ఉందా? పాలనపై పట్టు సాధించారా? కూటమి మార్క్ పాలన సాగుతోందా? లేదా? అధికారులు ఎమ్మెల్యేలను గౌరవించి వారి అభిప్రాయాల ప్రకారమే నిర్ణయాలు తీసుకుంటున్నారా?..అన్నది ఇప్పుడు సాగుతోన్న చర్చ. ఇపుడిప్పుడే సూపర్ సిక్స్ హామీల అమలు దశలో ప్రభుత్వం ఉంది. ఒక వైపు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు కూటమిలో సెగలు పుట్టిస్తున్నాయి. మరో వైపు పాలకపక్ష ఎమ్మెల్యేలూ ఎక్కడో తెలియని అసంతృప్తిలోనూ ఉన్నట్లు కనిపిస్తోంది. బయట పడకపోయినా సందర్భానుచితంగా ఏదో ఒక తరహాలో అభిప్రాయాలను అంతర్లీనంగా వెల్లడిస్తున్నారు. జిల్లా ఇన్చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లాకు వచ్చాక ఇది మరింత స్పష్టంగా కనిపిస్తోంది. అధికారులు ఆశించిన స్థాయిలో తమ మాట వినడం లేదన్న ఆవేదనను ఇన్చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ ఎదుట వెలిబుచ్చినట్లు సమాచారం. దీనికి ఆయన ఏం ఉపదేశం చేశారు...? భవిష్యత్తులో పాలనాపరమైన సమన్వయం పెరుగు తుందా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

పాలనపై పట్టులేదు

వాస్తవానికి పాలనలో ఇంకా పట్టు రాలేదు. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు మధ్య సమన్వయం కనిపించడం లేదు. దీంతో పనులలో జాప్యం కనిపిస్తోంది. పాలన వేగంగా లేదనే చర్చ వినిపిస్తోంది. మొన్నటి వరకు ఇప్పుడే కదా అధికారంలోకి వచ్చిందనే మాటలు వినిపించారు. రాను రాను అవి కూడా పోయాయి. ఏం జరుగు తుందనే దానిపై విశ్లేషకులు దృష్టి సారించారు. నాలుగు నెలలు దాటినా ఆశించినంత ఫలితం కనిపించడం లేదంటున్నారు. కారణం బదిలీ లలో జరిగిన జాప్యమే... ఇప్పటికీ యంత్రాంగం ప్రక్షాళన కాలేదు.

బదిలీలలో సమన్వయలోపం

జిల్లాస్థాయిలో ఎక్కువ శాతం అధికారులు మారినా క్షేత్రస్థాయిలో పూర్తిగా మార్పులు జరగలేదు. జరిగిన చోట్ల కూడా గతంలో వైసీపీకి ▶మిగతా 2లో..

11న కలెక్టరేట్ వద్ద ధర్నా

భవన నిర్మాణ కార్మికులు తరలిరండి

విశాలాంధ్ర - రాజమండ్రి: ఆంధ్ర ప్రదేశ్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) తూర్పుగోదావరి జిల్లా జనరల్ బాడీ సమావేశం బుధవారం రాజమహేంద్రవరం సీపీఐ కార్యాలయంలో ఏఐటియుసి జిల్లా కన్వీనర్ రాంబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ, ఏఐటీయూసీ జాతీయ సమితి సభ్యులు తోకల ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుక, నిర్మాణ రంగంలో ముడి సరుకులు అధిక ధర నియంత్రించాలని, బిల్డింగ్ నిర్మాణంలో సెస్ రూపంలో వసూలు చేస్తున్న నిధులు భవన నిర్మాణ కార్మికులకే ఖర్చు చేయాలని, సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు, ▶మిగతా 2లో..

లక్ష్యాలకు అనుగుణంగా ప్రగతి

కలెక్టర్ షణ్మోహన్

విశాలాంధ్ర - కాకినాడ : నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా వివిధ రెవిన్యూ అంశాలపై ప్రగతి కనబరిచేందుకు అధికారులు తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్..జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, కాకినాడ కమిషనర్ భావన ఇతర అధికారులతో కలిసి..రెవెన్యూ డివిజన్ అధికారులు, అన్ని మండలాల తహశీల్దార్లతో సమావేశం నిర్వహించారు. పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి ▶మిగతా 2లో..

పారదర్శకంగా ధాన్యం సేకరణ

- అందుబాటులో 64 లక్షల నాణ్యమైన గోనె సంచులు
- రైతులు, మిల్లర్లతో క్షేత్రస్థాయిలో కమిటీలు
- రైతుల సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ : జేసీ ధాత్రిరెడ్డి

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : జిల్లాలో రైతుల నుండి ధాన్యం కొనుగోలుకు పారదర్శకంగా అవసరమైన పటిష్ట చర్యలు తీసుకున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రి రెడ్డి స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా 80 లక్షల నాణ్యమైన గోనె సంచులు అవసరం అవుతాయని అంచనా వేయగా ఇప్పటికే 64 లక్షల 84 వేల 352 గోనెసంచులను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. రైతులు, మిల్లర్లను సమన్వయ పరుస్తూ క్షేత్రస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. బుధవారం ఏలూరు కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెసి ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ధాన్యం సేకరణలో లోడింగ్, అన్‌లోడింగ్‌కు సంబంధించి రైతులు రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని, దీనికి సంబంధించిన ఖర్చులను పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. ఒకవేళ ఎవరైనా ఈ చార్జీలు డిమాండ్ చేస్తే నేరుగా తమ దృష్టికి తీసుకు రావచ్చని చెప్పారు. ఈ ఏడాది 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 250 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అవసరమైన సిబ్బందికి శిక్షణ కూడా అందించినట్టు తెలిపారు. జిల్లాలో ఇంతవరకు 11 రైతు సేవాకేంద్రాల ద్వారా ▶మిగతా 2లో

అందుబాటులో ఉచిత ఇసుక

కలెక్టర్ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: జిల్లాలో ఇసుక వినియోగదారులు సులభంగా పొందేందుకు ఏర్పాట్లను పూర్తి చేసినట్టు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం ఇసుక అందుబాటులో లేని కారణంగా తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు డివిజన్ లో తీపర్రు, ఔరంగాబాద్ ఇసుక రీచ్ ల నుండి నేరుగా గాని, ఆన్లైన్లో ఆధార్ కార్డు ద్వారా బుక్ చేసుకుని ఉచిత ఇసుకను పొందేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. వినియోగదారుడు లోడింగ్ చార్జీలు, రవాణా చార్జీలు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వినియోగదారుడు ఆన్లైన్లో ఇసుకను బుక్ చేసుకున్న సందర్భంలో ఇసుక సంబంధిత వినియోదారునికి చేరక పోయినా, ఏమైనా ఇతర సందేహాలు ఉన్న వెంటనే జిల్లా కలెక్టరేట్ లోని ఇసుక ▶మిగతా 2లో

మహిళల రక్షణకు ‘అభయ’

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : మహిళల పట్ల వేధింపులకు పాల్పడుతున్న ఆకతాయిలకు చెక్ పెడుతూ సమాజంలో అసాంఘిక కార్యకలాపాల నిరోధానికి మహిళా పోలీసులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఏలూరు రేంజ్ ఐజి జి.వి.జి.అశోక్ కుమార్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాల యం వద్ద గల పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఏర్పాటు చేసిన అభయ మహిళా సేఫ్టీ లోగో ఆవిష్కరణ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రీ సెల్వి, జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసారు. ఈ సందర్భంగా ఐజి అశోక్ కుమార్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో అభయ మహిళా సేఫ్టీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయ మన్నారు. పోలీసు వ్యవస్థలో 30శాతం మహిళా పోలీస్ సిబ్బంది పని పనిచేస్తున్నారని, మహిళల రక్షణకు మహిళా పోలీసులు, గ్రామ మహిళల సంరక్షణ కార్యదర్శులు గస్తీలు నిర్వహిస్తూ కళాశాలలు, వసతి గృహాలు, బస్టాండ్ వద్ద ఆకతా యిల వేధింపులకు చెక్ పెట్టాలని సూచించారు. ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో అభయ యాప్ ప్రవేశ పెట్టడం మహిళా రక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ ఎన్.సూర్య చంద్రరావు, ఏలూరు డిఎస్పీ డి.శ్రావణ కుమార్, ఏఆర్ ఆర్ఐ పవన్ కుమార్, ఏలూరు వన్ టౌన్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఇన్స్పెక్టర్ వై.వి.రమణ, 3 టౌన్ ఇన్స్పెక్టర్ కోటేశ్వర రావు, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎం.సుబ్బా రావు, కైకలూరు రూరల్ ఇన్స్పెక్టర్ బి.రవి కుమార్, ఎస్సై ఇన్స్పెక్టర్ మల్లేశ్వరరావు, మహిళా ఎస్సై కాంతిప్రియ, మౌనిక, నాగ కళ్యాణి, పోలీస్ సిబ్బంది,మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించండి : ట్రాఫిక్ సిఐ లక్ష్మణ్

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : ప్రమాదాల నివారణకు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంతో పాటు ట్రాఫిక్ నియమ నిబంధ నలు తప్పనిసరిగా పాటించాలని ఏలూరు ట్రాఫిక్ సిఐ లక్ష్మణరావు సూచించారు. ఏలూరు లోని విద్యానగర్‌లోని శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ లక్ష్మణ్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు పెరిగిపోయాయని వాటి నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెల గాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మితిమీరిన వేగంతో ప్రయాణించడం వల్ల అనేక అనార్థాలు చోటుచేసుకుని ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని గుర్తు చేశారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ వేగాన్ని నియంత్రించుకొని సురక్షితంగా హెల్మెట్ శిరోధారణతో ప్రయాణించి గమ్యస్థానానికి చేరుకోవాలని లక్ష్మణ్ సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ బి.అమరేశ్వర రావు, చైతన్య పాఠశాలల ఏజియం పార్థ సారధి, ప్రిన్సిపాల్ దుర్గారావు, రిజినల్ ఇన్చార్జి ఉదయభాస్కర్, సి-బ్యాచ్ అకడమిక్ కో-ఆర్డినేటర్ వెంకటేశ్వర రావు, డీన్ కెవి.లక్ష్మణ్ కుమార్, ఐపిఎల్ ఇంచార్జి ఎన్.సత్యనారాయణ, ప్రైమరి ఇంచార్జి సిహెచ్.అరుణ, ప్రైమరి ఇంచార్జి టి. ఝాన్సీ, ఉపాధ్యాయులు, ట్రాఫిక్ పోలీసులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

రబీలో పండించే పంటలకు బీమా చేయించుకోవాలి

విశాలాంధ్ర-లింగపాలెం: పొగాకు పంటకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహం లేదని రైతులు ఈపంటకు బదులుగా ప్రత్యా మ్నాయ పంటలు వేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. పొలం పిలుస్తుంది కార్యక్రమాల్లో భాగంగా లింగపాలెం, సింగగూడెం,కొత్తపల్లి మఠంగూడెంలో జరిగిన అవగాహన సదస్సులలో రైతులకు ఈయన పలు సూచనలు చేశారు. పొగాకు డ్రగ్స్‌కు సంబంధించిన పంటగా ప్రభుత్వం గుర్తించిందని అందువల్లే ఈపంటకు ప్రోత్సాహం ఇవ్వటం లేదని ఈయన వివరించారు. ప్రధానంగా మెట్ట మండలాల్లో రబీలో నీటి వినియోగం తక్కువగా ఉన్న మొక్కజొన్న, మినుము,పెసరతో పాటు అధికారులు సూచించిన తదితర పంటలు పండించాలని తెలిపారు. రబీలో పండించే వరి, మొక్కజొన్న పంటలకు బీమా చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి వివరించారు. వరి పంటకు ఎకరాకు రూ.500లు, దేశవాళి మొక్కజొన్న పంటకు ఎకరాకు రూ.483 బీమా చెల్లించాలని తెలిపారు. ఈసేవ కేంద్రాలలో బీమా చెల్లించే సౌకర్యం ఉందని ఈయన వివరించారు.రైతులు వ్యవసాయ శాఖ అధికారులు చెప్పే సూచనలను పాటించాలని ఈయన కోరారు.

ప్లాస్టిక్ నిషేధించాలి

విశాలాంధ్ర -భీమవరం: ప్లాస్టిక్ రహిత సమాజాన్ని తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహశీల్దార్ రావి రాంబాబు అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. రాంబాబు మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులు ఉపయోగిం చడం వల్ల ఎంతో నష్టం వాటిల్లుతుందని, కాలువలు మూసుకుపోవడం, భూగర్భజలాల మొదలైన వాటితోపాటు విచక్షణ రహితంగా ఉపయోగించే రసాయనాల వల్ల పర్యావరణ సమస్యలు కలుగుతాయని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పర్యావరణానికి ప్రమాదంగా మారిన సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని స్వచ్ఛందంగా నిషేధించాలని ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో భట్టిప్రోలు శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక

(1వ పేజీ తరువాయి)

ఫెసిలిటేషన్ సెంటర్ నెంబర్లకు 93914 45753, 86682 91997, 81869 39223, 95501 75144 తెలియజేయలన్నారు. ఇసుకను అక్రమ మార్గంలో తరలించి సొమ్ము చేసుకుంటే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. నేరుగా గాని ఆన్లైన్లో గాని పొందే సందర్భంలో మధ్యవర్తులను ఆశ్రయించవద్దని, వినియోగదారుడు మాత్రమే నేరుగా గాని, ఆన్లైన్లో గాని ఇసుకను పొందాలని ఆమె తెలిపారు. పెండ్యాల నుండి ఇసుకను పొందేందుకు కూడా అవకాశం ఉందని, పెండ్యాల కు దగ్గరగా ఉన్నవారు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను పొందవచ్చని కలెక్టర్ సూచించారు.

అనుగుణంగా ప్రగతి

(1వ పేజీ తరువాయి)

తీసుకున్న చర్యలు, నగర వనం, స్మశాన వాటికలు డంపింగ్ యార్డ్స్, జాతీయ రహదారు లకు అవసరమైన భూసేకరణ పనులు, ఉపాధ్యాయ, పట్ట భద్రుల ఎమ్మెల్సీ, సాగు నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల నమోదు, ఎన్నికల ప్రక్రియ వంటి అంశాలపై జిల్లా కలెక్టర్..క్షేత్రస్థాయి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ..జిల్లాలో త్వరలో సాగునీటి సంఘాల ఎన్నికలు, ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అధికా రులు సమన్వయంతో పనిచేసి ఓటర్ల నమోదు, జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఎన్నికల కోడ్ అమలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో రెవెన్యూ విషయాలపై అందిన అర్జీలపై శ్రద్ధ వహించి అర్జీదారులకు శాశ్వత పరిష్కారం అందించాలన్నారు. దీపావళి కానుకగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అందించిన దీపం-2 పథకం అర్హతలపై లబ్దిదారుల విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె వెంకటరావు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్ మల్లిబాబు, కె.శ్రీరమణి, ఎన్ఎస్ఎఐ పీడీ బెనర్జీ, ఏపీఐఐసీ జెడ్ఎం ఎ రమణారెడ్డి, రోడ్డు భవనాలు, ఇరిగేషన్ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, అన్ని మండలాల తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా

(1వ పేజీ తరువాయి)

తదితర డిమాండ్ల సాధనకై నవంబర్ 11వ తేదీ చలో కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేయాలని పిలుపునిచ్చారు. నిర్మాణ రంగంలో పనిచేస్తున్న తాపీ మేస్త్రి, పెయింటర్లు, సెంట్రింగ్ మేస్త్రి, రాడ్ బెండర్స్, ఎలక్ట్రీషియన్లు, మార్బుల్, టైల్స్, కార్పెంటర్స్, మట్టి పని చేసేవారు తదితర 36 రంగాల కార్మికులు నవంబర్ 11వ తేదీ పనులు నిలుపుదల చేసి కలెక్టరేట్‌కు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జట్టు లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సప్ప రమణ, సిపిఐ నగర కార్యదర్శి వంగమూడి కొండలరావు, భవనిర్మాణ కార్మిక సంఘం నాయకులు వి.మహేష్ బాబు, ఆటో యూనియన్ నాయకులు రామచంద్రరావు, ఆదినారాయణ, మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ లావణ్య, సీపీఐ క్వారీ కార్యదర్శి టి.నాగేశ్వర జట్లు సంఘం నాయకులు దేముడు బాబు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఏం జరుగుతోంది?

(1వ పేజీ తరువాయి)

అనుకూలంగా ఉన్న వారే ఇప్పుడు స్థానాలు మారారని చెబుతున్నారు. వారిపై ఆరా తీసిన ప్రజాప్రతినిధులు వైసీపీకి అనుకూలంగా ఉన్నారని, ఇప్పుడు పనులు చేయడం లేదని అసంతృప్తిలో ఉన్నారు. ఈసారి ఎందుకో గాని బదిలీల విషయంలో ప్రభుత్వ పెద్దలకూ,జిల్లా నేతలకు మధ్య సమన్వయం లోపించింది. అక్కడ నుంచే పాలనపై ప్రభావం పడింది.కలెక్టర్, ఎస్.పి.ల బదిలీల తర్వాత జిల్లా అధికారుల విషయంలో ఏకాభిప్రాయం లేదు. ఎమ్మెల్యేలు తమ ఇష్టానుసారంగా తమకు నచ్చిన అధికారులకు లేఖలు ఇచ్చారు. మంత్రితో సంప్రదింపులు లేకుండానే బదిలీలు జరిగాయి. అందరూ కూర్చొని చర్చించి జాబితాలు తయారు చేయలేదు. ఒక జాబితా మాత్రం ప్రభుత్వానికి చేరింది. అందులో 10 శాతం మంది కూడా జిల్లా నేతలు సూచించిన వారికి అవకాశం రాలేదు. అందరినీ పైనుంచి ఎంపిక చేసి పంపారు. ప్రజా ప్రతినిధులు తెల్లమొఖం వేయాల్సి వచ్చింది. మంత్రులను అడిగారు. అంతా లోకేష్ నిర్ణయం అన్న చర్చ నడిచింది. ఇచ్చిన లేఖలు బుట్ట దాఖలు అయ్యాయి.పైనుంచి ఎంపిక చేసి పంపారనే గుసగుసలు నడిచాయి. అందరూ మౌనంగా అసంతృప్తిగానే ఉన్నారు. చేసేదేమీ లేకపోవడంతో సర్దుకుపోతున్నారు.పైనుంచి ఎంపిక చేసిన అధికారులు కావడంతో అందరూ తమ ఉద్యోగ ధర్మంతోనే ఉన్నారు.ప్రజా ప్రతినిధులపై ప్రత్యేక అభిమానం ఏమీ లేదు. నిబంధనల ప్రకారం పోతున్నారు. నిధులు,ఇతర కారణాలు చెప్పి పనులు చేయడం లేదనే భావన నేతల్లో పెరిగింది.

ప్రజా ప్రతినిధుల ఆదేశాలు భేఖాతరు

రెవెన్యూ, పోలీసు శాఖ పరంగా ఎమ్మెల్యేల మాట అధికారులు వినడం లేదనే చర్చ కొద్ది కాలంగా నడుస్తోంది.ఇదే విషయాన్ని కొందరు ప్రజా ప్రతినిధులు ఇన్చార్జి మంత్రి వద్ద గోడు వెళ్లబోసుకున్నట్టు తెలిసింది.దీనిపై ఆయన అధికారులకు స్పష్టత ఇచ్చినట్లు ఎమ్మెల్యేలు చెప్పినట్లు విని పనులు చేయాలని కలెక్టర్,ఎస్.పి. లకు సూచించారని సమాచారం. ఇటీవల జరిగిన సమావేశం అనంతరం ఎస్.పి. తో ప్రజాప్రతినిధులు భేటీ అయ్యారు. అక్కడ దిశా నిర్దేశం చేసినట్లు నాయకులు తెలిపారు. ఏదేమైనా పాలనాపరంగా అవాంతరాలు తొలగలేదు. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు మధ్య సమన్వయం మెరుగుపడలేదు.పాలక పక్ష ప్రజాప్రతినిధుల మధ్య కూడా ఎక్కడో తెలియని అంతరం కూడా కనిపిస్తోంది.ముఖ్యమంత్రి చంద్రబాబు క్షేత్రస్థాయిలో వాస్తవాలను తెలుసుకొని పాలనను గాడిలో పెట్టాలి. లేదంటే చరిత్ర పునరావృతం అవుతుంది అనడంలో సందేహం లేదు.

ధాన్యం కొనుగోలు నిర్వహణ సక్రమంగా ఉండాలి

విశాలాంధ్ర - ముదినేపల్లి : ధాన్యం కొనుగోలు నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బొమ్మినంపాడు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు సరైన సమయంలో సేకరించి రైతులకు సంచులు అందించాలని, నాణ్యత ప్రమాణాలు గుర్తించేటప్పుడు రైతులకు నష్టం కలగకుండా నిబంధనలు పాటించాలన్నారు. రైతులను ఇబ్బంది పెట్టవద్ద న్నారు. మండలంలో, నియోజకవర్గంలో ఉన్న కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు దళారుల బారిన పడకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని, కేంద్రాల నిర్వహణ అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దారం సుధ, నియోజకవర్గ టిడిపి కన్వీనర్ వీరమల్లు నరసింహారావు , మండల పార్టీ అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, బొప్పన సుందరామయ్య, ఈర్పుగంటి శ్రీనివాస్, దావు నాగరాజు , తదితరులు పాల్గొన్నారు.

10న డీఎస్సీ స్క్రీనింగ్ పరీక్ష

విశాలాంధ్ర-భీమవరం: మెగా డిఎస్సీకి సిద్ధపడ్డున్న ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణకై ఈ నెల 10వ తేదీన స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి యం.శోభరాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భీమవరం డిఎన్నార్ కళాశాల, తాడేపల్లిగూడెం శశి ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష ఉదయం 10.30 గం" నుంచి మధ్యాహ్నం 1.30 గం" వరకు నిర్వహించబడుతుందని, అభ్యర్థులు ఉదయం 10 గ"టలకు పరీక్షా కేంద్రంలో రిపోర్ట్ చేయాలని 10.15 నిముషముల తరువాత అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతించబోరని స్పష్టం చేశారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను జ్ఞానభూమి.ఎపి.గవ్.ఇన్ వెబ్సైట్ నందు డౌన్ లోడ్ చేసుకోవాలని ఆమె సూచించారు.

షష్టి ఉత్సవాల పనులకు రాటతో శ్రీకారం

విశాలాంధ్ర - ముదినేపల్లి : ముదినేపల్లి మండలం సింగరాయపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానం షష్టి ఉత్సవాల ఏర్పాట్ల పనులకు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. షష్టి ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చూడాలన్నారు. వచ్చే వారి రద్దీని ముందుగానే గుర్తించి ఏర్పాట్లుచేసి పర్యవేక్షించాలన్నారు. శాంతిభద్రతలు సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. తాగునీటి సౌకర్యం, వైద్యం అందుబాటులో ఉంచాలని, పారిశుద్ధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రుద్రరాజు గంగాశ్రీదేవి, మండల పార్టీ అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, నాయకులు చలసాని జగన్మోహన్రావు , బొంగు రవికుమార్, పరసా విశ్వేశ్వరరావు , వీరంకి వెంకయ్య , కొండ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ (1వ పేజీ తరువాయి)

రూ. 1.22 కోట్ల విలువైన 610 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ధాన్యం కొను గోలు చేసిన 48 గంటల్లోపు రైతు ఖాతాలో సొమ్ము జమ చేస్తామన్నారు. ధాన్యం కొనుగోలులో ఏవైనా సమ స్యలు ఎదురైతే పరిష్కరించేందుకు 77020035 84 నెంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. దీపం పథకం-2కు సంబంధించి జిల్లాలో ఇంతవరకు 70 వేల మంది బుకింగ్ చేసుకోగా 33 వేల మందికి సిలిండర్లు అందజేయడం జరిగిందన్నారు. ఖాళీ సిలిండర్లు అందుబాటులో లేకుండా బుకింగ్ చేయవద్దని తెలిపారు. ఏడాదికి 3 సిలిండర్లు బుక్ చేసుకొనే అవకాశం మార్చి వరకు ఉందన్నారు. వినియోగదారులు తప్పని సరిగా ఈకెవైసి చేయించు కోవాలని చెప్పారు. సమావేశంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు వి.శ్రీలక్ష్మి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవికరాణి తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి పైపులైనుకు లీకేజీ

మురికినీరు సరఫరాతో భోగోలు ప్రజల ఆందోళన

విశాలాంధ్ర-లింగపాలెం: భోగోలుకు మంచినీరు సరఫరా చేసే పైపులైను దెబ్బ తినటం వల్ల లీకేజ్ అయ్యి మురికి నీరు సరఫరా అవుతున్నది. భోగోలు పంచాయతీలోని భోగోలు, వెంకటాపురం, రాయన్నపాలెం గ్రామాలకు చెందిన దాదాపు 3వేలమంది ప్రజలు ఈ నీటినే తాగుతున్నారు. కలరాయన గూడెం సరిహద్దు ప్రాంతం బోరు



వేసి అక్కడ నుంచి దాదాపు మూడు కిలోమీటర్ల మేర ప్రధాన రోడ్డు మార్గం పక్కనుంచి పైపులైను వేసి మంచినీరు సరఫరా చేస్తున్నారు. ఇటీవల ఈ మార్గంలో ఇసుక, మట్టి(ట్రాక్టర్లు,రోడ్డు నిర్మాణాలకు చిప్స్ తీసుకువెళ్లే లారీలు ఎడతెరిపి లేకుండా తిరుగుతున్నాయి. వీటితో ఈమార్గమంతా రద్దీగా ఉంది. వాహనాలు తిరగటం వల్ల పైపులైను దెబ్బతిన్నట్లు స్థానికులు అంటున్నారు. దీనివల్ల గ్రామానికి సరఫరా అయ్యే నీరు లీకేజీ అవుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. భోగోలు గ్రామంలో అనేకమంది కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఉన్నారు.ఈవ్యాధి కాకుండా వివిధ వ్యాధులతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. ఇటువంటి పరిస్థితులు ఉన్న ఈ గ్రామానికి మురికి నీరు సరఫరా అవ్వడంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. లీకేజీని నివారించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. లీకేజీలను నివారించి పరిశుభ్రమైన నీటిని సరఫరా చేసే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సుధాకర్ కుటుంబాన్ని ఆదుకుంటాం

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు తూర్పువీధి పేలుడు ఘటనలో మృతి చెందిన దుర్గాసి సుధాకర్ కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి

భరోసా ఇచ్చారు.బుధవారం ఏలూరు 1టౌన్‌లోని నవాబ్ పేట కాలనీలో సుధాకర్ ఇంటికి తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులుతో కలిసి వెళ్ళిన ఎమ్మెల్యే చంటి బంధువులను పరామర్శించిన అనంతరం సుధాకర్ చిత్రపటానికి నివాళులర్పించారు.అనంతరం టిడిపి ప్రకటించిన రూ. 1లక్ష ఆర్థికసాయం చెక్కును గన్ని వీరాంజనేయులుతో కలిసి ఎమ్మెల్యే చంటి సుధాకర్ భార్యకు అందజేశారు.అనంతరం ఆశ్రం ఆసుపత్రికి చేరుకుని ఇదే ఘటనలో గాయాలపాలై ఆశ్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎం.పెద్దిరాజు ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే చంటి స్వయంగా తెలుసుకున్నారు.బంధువులతో మాట్లాడి,వారికి తెలుగుదేశం పార్టీ ప్రకటించిన విధంగా రూ.20 వేలను వారికి అందించి ధైర్యం చెప్పారు.ఎమ్మెల్యే వెంట జనసేన ఏలూరు ఇన్‌ఛార్జ్ రెడ్డి అప్పలనాయుడు, కో - ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం. జాలా బాలాజీ, టిడిపి నాయకులు ఆర్నేపల్లి తిరుపతి, అమరావతి అశోక్, వందనాల శ్రీను, బొద్దాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లు... ఎన్నేళ్లు..!

విశాలాంధ్ర - పెనుమంట్ర: గ్రామీణ ప్రాంత యువత పోటీ పరీక్షలకు సన్నద్ధ మయ్యేందుకు ఉపయోగపడేలా అన్ని మౌలిక సదుపాయా లతో డిజిటల్ గ్రంథాల యాలను అందుబాటు లోకి తేవాలన్న ప్రభుత్వ

ఆదేశాలు అమలుకు నోచుకోవడం లేదు. గ్రామాల్లో భవన నిర్మాణాలు నత్త నడకన సాగుతున్నాయి. పెనుమంట్ర మండలం భట్ల మగుటూరులో 2021 సెప్టెంబర్ 5న గత ప్రభుత్వం మాజీ మంత్రి వనిత ఈ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సుమారు రూ.16.10 లక్షలతో చేపట్టిన ఈ పనులు ప్రారంభించి దాదాపు మూడేళ్లు కావస్తున్న నేటికీ పూర్తి కాలేదు. ఆది నుంచి ఈ పనులు ఆగుతూ... సాగుతుండడంతో ఎప్పటికీ పూర్తవుతాయో అంతు చిక్కడం లేదు. ఏళ్ల తరబడి సాగుతున్న ఈ భవన నిర్మాణాల పరిస్థితి చూసి ప్రజలు ముక్కున వేరేసుకుంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మారిన ప్రజలకు ఉపయోగపడే ఈ గ్రంథాలయ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

ఆపార్‌కు ఆధార్ అనుసంధానం వేగవంతం చేయాలి

విశాలాంధ్ర ప్రతినిధి - ఏలూరు: పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆపార్‌కు ఆధార్ అనుసంధాన ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పాఠశాల ప్రధానోపాధ్యాయుని ఆదేశించారు. బుధవారం స్థానిక గాంధీనగర్ నగర పాఠశాలను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సందర్శించారు.ఈ సందర్భంగా ఆపార్(ఆటోమేటెడ్ ఐడి పర్మినెంట్ ఎకడామిక్ అక్కౌంట్ రిజిస్టరి) నమోదులో భాగంగా ఇంటర్ వరకు చదువుకున్న ప్రతి విద్యార్థి వివరాలు ఆన్‌లైన్లో నమోదు చేయాల్సివుందన్నారు.ఈ ప్రక్రియలో భాగంగా ఆధార్ లోని వివరాలు, పాఠశాలలోని రిజిస్ట్రేషన్ లోని వివరాలు,యు-డైస్ ప్లెస్ లోని వివరాలు ఒకేలా ఉండాలన్నారు.ఒకవేళ అటువంటి వ్యత్యాసాలు ఏవైనా ఉంటే సాయంత్రం లోగా సరిచేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు పట్టీని కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలలో పారిశుధ్యం, త్రాగునీరు, మధ్యాహ్నం భోజన పథకం తీరును కలెక్టర్ పరిశీలించారు. అనంతరం

మధ్యాహ్నం భోజన పథకం నాణ్యతా ప్రమాణాలతో విద్యార్థులకు అందజేసే విధంగా ఉపాధ్యాయులు తరచూ భోజనాన్ని తనిఖీ చేస్తుండాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ప్రధానోపాధ్యాయుడు కె. కృష్ణప్రసాద్, మున్సిపల్ కమీషనరు ఎ. భానుప్రతాప్, తహశీల్దారు జి.వి.శేషగిరి, డిప్యూటీ కమిషనరు శివారెడ్డి,మున్సిపల్ ఇంజనీరు సురేంద్రబాబు, డిఇ తాతబ్బాయి తదితరులు ఉన్నారు.

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశం జయప్రదం చేయండి

విశాలాంధ్ర-ఏలూరు: ఈ నెల 23న జంగారెడ్డిగూడెం క్లబ్ హాల్, రాజుల కాలనీలో జరిగే ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) జనరల్ బాడీ సమావేశం జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాల యం స్ఫూర్తి భవనంలో గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ డాంగే, ఏఐటీయూసీ గౌరవాధ్యక్షులు కె.కృష్ణమాచార్యులు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కే. విగ్నేష్, బజంత్రీ శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 123 కార్పొరేషన్, మున్సిపాలిటీ, నగర పంచాయతీల్లో 52వేల మందికి పైగా పర్మినెంట్, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రజారోగ్యంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం అన్నారు. ప్రతిరోజు ప్రజల మలినాలు,చెత్త శుభ్రం చేస్తూ అంటు రోగాలైన డెంగ్యూ, డయేరియా, మలేరియా వంటి విషజ్వరాలు ప్రభల కుండా ప్రాణాలకు సైతం లెక్కచేయకుండా పారిశుధ్య కార్మికులు ప్రజలకు సేవలందిస్తున్నా రని తెలిపారు. కాంట్రాక్టు,ఔట్ సోర్సింగ్, ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి కార్మికులను పర్మినెంట్ చేయాలని

డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు రూపాయిలు ఇవ్వాలని, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డ్రైవర్లకు రూ. 18,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 23న జంగారెడ్డిగూడెంలో గల రాజుల కాలనీ లో గల లైన్స్ క్లబ్ హాలులో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం జరుగుతుందని, ఈ సమావేశానికి జిల్లాలోని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్మికులందరూ హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా గౌరవాధ్యక్షులు కంకిపాటి బుచ్చిబాబు, సహాయ కార్యదర్శి తోర్లపాటి బాబు, పుల్లారావు, కుంచే వసంతరావు, ఏఐటీయూసీ ఏలూరు నగర కార్యదర్శి ఎ. అప్పలరాజు, వై. దుర్గారావు, బాలు, శ్రీనివాసరావు, డి. రవీంద్ర భాస్కరరావు, మల్లేశ్వరరావు, వై. ప్రసాద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులంతా సోదరభావంతో మెలగాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: గ్రామస్తు లంతా సోదర భావంతో కలిసిమెలిసి ఉండాలని జీలుగుమిల్లి సిఐ బి. వెంకటేశ్వరరావు తెలిపారు. తెడ్లం గ్రామ పంచాయతీ పరిధి లోని మరియపురంలో గ్రామ పెద్దలు నాలుగు కుటుంబాలను సాంఘిక బహిష్కరణ చేశారన్న సమాచారంతో జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, పోలవరం డిఎస్పీ ఎం. వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు పోలీసు, రెవెన్యూ అధికారులు గ్రామంలో బుధవారం గ్రామసభ నిర్వహించి నాలుగు కుటుంబాలు వెలివేతకు కారణాలను



విచారించి పలు అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ పెద్దలకు, ప్రజలకు కౌన్సిలింగ్ ఇచ్చి అధికారుల సూచనలకు అనుగుణంగా ప్రజలు అందరు కలిసి ఉంటామని గ్రామస్తులు అంగీకరించినట్లు ఆయన తెలిపారు.

చినవెల్లమిల్లిలో అంబేద్కర్ విగ్రహం పాక్షికంగా ధ్వంసం

అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం

విశాలాంధ్ర-ఉంగుటూరు : ఉంగుటూరు మండలం వెల్లమిల్లి గ్రామపంచాయతీ శివారు చినవెల్లమిల్లిలో అంబేద్కర్ విగ్రహం పాక్షికంగా ధ్వంస మైంది. మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగినట్టు తెలిసింది. వివరాలు ఇలా ఉన్నాయి. చిన వెల్ల మిల్లి గ్రామంలో సుమారు 10

సంవత్సరాల క్రితం అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని మంగళవారం అర్ధరాత్రి కొంత మంది గుర్తుతెలియని దుండగులు అంబేద్కర్ విగ్రహం చేతి వేలును ధ్వంసం చేశారు. బుధవారం ఉదయం ఈ విగ్రహం ధ్వంసం కావడాన్ని జై భీమ్ నాయకులు గుర్తించారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను అరెస్టు చేయాలని దళితులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న చేబ్రోలు ఎస్ఐ సూర్య భగవాన్, ఉంగుటూరు డిప్యూటీ తహసీల్దార్ పోతురాజు, వీఆర్వోలు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు ఎస్ఐ దళిత నాయకులతో, గ్రామ మాజీ సర్పంచ్ మెడవంకల రత్తయ్యతో మాట్లాడారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్సై హామీ ఇచ్చారు. మద్యం సేవించి శాంతి భద్రతలకు ఆటంకం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అటువంటి వారు ఎవరైనా ఉంటే తనకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు. అనంతరం విగ్రహాన్ని ధ్వంసం చేసిన చోట సిమెంటుతో అతికించారు. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలదండలు వేసి ఘన నివాళులు అర్పించారు.

ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా మహాసభ జయప్రదం చేయండి

విశాలాంధ్ర-చింతలపూడి: ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధి కారి ఎం.సాయికుమార్ పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా మహాసభ ఈ నెల

9వ తేదీన ఏలూరు నగరంలోని స్ఫూర్తి భవన్, సీపీఐ కార్యాలయంలో నిర్వహిస్తున్న సందర్భంగా స్థానిక శ్రీవిద్య డిగ్రీ కళాశాల లో విద్యార్థులకు ఏఐఎస్ఎఫ్ చరిత్ర, సాధించిన విజయాలను తెలియపరచి సభ్యత్వం నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం. సాయికుమార్ మాట్లాడుతూ విద్యారంగంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్య లను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న జగనన్న విద్యాదీవెనను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్లో ఉన్నటువంటి రూ.3,480 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ తొర్లపాటి రాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ డి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణాన్ని చేపట్టాలి

విశాలాంధ్ర -కామవరపుకోట: కామవరపుకోట శివారు కొండగూడెం గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవటంతో వర్షపు నీరు ఎక్కడికి అక్కడ నిల్వ ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది లకు గురవుతున్నారని, స్థానిక పంచాయతీ అధికారి వెంటనే స్పందించి తగు

చర్యలు తీసుకోవాలని సిపిఐ కొండగూడెం శాఖ డిమాండ్ చేసింది. గ్రామంలో మంచినీటి వసతి, వీధిలైట్ల సమస్యలను పరిష్కరించాలని నూతనంగా ఎన్నికైన సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి మందపాటి ధర్మారావు, బండి విశ్వేశ్వరరావు పంచాయతీ అధికారులను కోరారు. సుదీర్ఘ కాలంగా సాగు చేసుకుంటున్న భూముల్లో సాగుదారులకు యాజమాన్య హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆశ్రం ఆధ్వర్యంలో 'శ్రేయస్సు'

విశాలాంధ్ర-ఏలూరు: ఆశ్రం ఆసుపత్రి ఆధ్వర్యంలో ఓ కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు ఆశ్రం హాస్పిటల్స్ సీఈవో డాక్టర్ హనుమంతరావు.

ఆశ్రం విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ గోకరాజు గంగరాజు ఆదేశాల మేరకు ఆశ్రం హాస్పిటల్స్‌లో శ్రేయస్సు పేరుతో నూతన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా రోగుల్లో భయాందోళనలను తొలగించి, తద్వారా పూర్తి స్థాయి వైద్య సేవలుపొందేలా చేయడం ముఖ్య ఉద్దేశమని తెలియ జేసారు. నవంబర్ నెలలో పలు క్యాన్సర్ అవగాహనా దినోత్సవాలను దృష్టిలో ఉంచుకొని ముందుగా క్యాన్సర్ రోగులకు స్వాంతనపరిచేలా ఈకార్యక్రమం రూపొందించినట్టు తెలియజేసారు. మనోబలానికి మించిన మందులేదు అనేలా రూపొందిన ఈ కార్యక్రమంలో పలువురు క్యాన్సర్ విజేతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు క్యాన్సర్ వ్యాధి నిశ్శబ్దంగా ప్రబలుతోందని, జాతీయస్థాయిలో రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు ముఖ్య ప్రాధాన్యత కలిగి ఉన్నాయని, వాటి గురించి అవగాహన కల్పించే దిశగా ఆశ్రం హాస్పిటల్స్ పనిచేస్తోందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో క్యాన్సర్ వైద్యనిపుణులు డాక్టర్ శైలజ, డాక్టర్ సింధు, డాక్టర్ కన్మణి,గ్రూప్ సి.ఓ.ఓ రాజ రాజన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వాలింది...కూలితే..!

విశాలాంధ్ర - పెనుమంట్ర: ఆలమూరు గ్రామం నుండి పెనుమంట్ర వెళ్లే ప్రధాన మార్గంలో ఆలమూరు పంచాయతీకి సమీపాన విద్యుత్ స్తంభం ప్రమాదంగా మారింది. కొద్దిరోజులుగా ఈ స్తంభం ఒక వైపుకు వాలిపోయింది. దీంతో ఏ క్షణాన ఏ ప్రమాదం ఉంచుకొస్తుందోనని అంతా భయపడుతున్నారు. వాలిన స్తంభాల విషయంలో సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది సరిగ్గా దృష్టి పెట్టడం లేదు. ఫలితంగా చిన్నపాటి గాలులకు స్తంభాలు కూలి, తీగలు తెగి గంటల తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది.అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్ ఆర్డిఓ తనిఖీ

విశాలాంధ్ర-భీమడోలు: భీమడోలు మండలం పాటూరు గ్రామంలో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్‌ను బుధవారం ఏలూరు ఆర్డీఓ అచ్యుత అంబరీష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లను, అందుబాటులో ఉన్న బియ్యం నిల్వలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు బియ్యం సరఫరాపై ఆర్డీఓ ఆరా తీశారు. వీరి వెంట తహశీల్దారు రమాదేవి, రెవిన్యూ, సివిల్ సప్లై సిబ్బంది పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్‌లో డిగ్రీ విద్యార్థులకు ద్వితీయ స్థానం

విశాలాంధ్ర - గణపవరం: టేబుల్ టెన్నిస్‌లో గణపవరం శ్రీ చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకల పాటి నిర్మల కుమారి బుధవారం అన్నారు. రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల టేబుల్ టెన్నిస్ పోటీలలో ఎస్ కే వి పి డిగ్రీ కళాశాల పెనుగొండలో జరిగిన పోటీలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానాన్ని సాధించారని. విద్యార్థి అంజన్ కుమార్ యూనివర్సిటీ పోటీలకు సెలెక్ట్ అయినట్టు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి మధు రాజు, కళాశాల పిడి ఎ. స్వాతి, కెమిస్ట్రీ లెక్చరర్ శ్రీనివాస్, ఫిజిక్స్ లెక్చరర్ గణేష్, పలువురు కళాశాల అధ్యాపక అధ్యాపకేతర బృందం గెలుపొందిన విద్యార్థులను అభినందించారు.

రహదారులకు మరమ్మతులు చేపట్టండి

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు

విశాలాంధ్ర- ముసునూరు : రహదారులకు మరమ్మతులు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధ్వానంగా మారిన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ ఈనెల 8న సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతుందని తెలిపారు. నూజివీడు ఏలూరు ప్రధాన రహదారి గుంతలు పడి చెరువులను తలపిస్తున్నా యని, నిత్యం వాహన చోదకులు, ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నా రని పేర్కొన్నారు. నూజివీడు నుండి ముసునూరు మీదుగా ఏలూరు వెళ్లే ఆర్ అండ్ బి ప్రధాన రహదారిలో పెద్దపెద్ద గోతులు ఏర్పడి చెరువులను తలపిస్తున్నాయని, ఈ రోడ్డు బాగు చేయడంలో ప్రభుత్వం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తుండడంపై భారత కమ్యూనిస్టు పార్టీ నూజివీడు ఏరియా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన కార్యక్రమం

చేపట్టేందుకు పిలుపునిస్తున్నట్లు తెలిపారు . ఏళ్ల తరబడి ఈ ప్రధాన రహదారి మరమత్తులకు నోచుకోక అనేక చోట్ల గొంగలు పడి, పెద్ద పెద్ద గోతులు ఏర్పడినిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక గ్రామాల ప్రజలు ఎత్తును పాల్గొనాలని పిలుపునిచ్చారు.

భూ దందాలపై మేజిస్ట్రేట్ విచారణ జరిపించాలి

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం పట్టణ, చుట్టుపక్కల గ్రామాలను ఆనుకొని ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు భూములపై రియల్ ఎస్టేట్ మాఫియాను అరికట్టాలని బి కే యం యు పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్ అధికారి కతీబ్ కౌసర్ భానో ను సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు నల్లమిల్లి ఫణి శ్రీనివాసరెడ్డి ఆర్డీవో కార్యాలయంలో ఆమెను కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లి గూడెం నియోజకవర్గంలోని, తాడేపల్లి గూడెం పట్టణం, పెద్ద తాడేపల్లి, పడాల, కుంచనపల్లి, ప్రత్తిపాడు, పెంటపాడు, జట్లపాలెం, తాళ్ల ముదునూరు పాడు, దర్శిపర్రు, జువ్వలపాలెం, ఆరుగొలను గ్రామాలను ఆనుకొని ఉన్న పుంత పోరంబోకు భూములు ,కాళ్లదారి, బండి దారి, పంట బోదులు, కుంటలు, ప్రభుత్వ చెరువులు, ప్రభుత్వ భూములు, ప్రైవేట్ చెరువులు,ప్రైవేటు భూములు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా 2000 సంవత్సరం నుండి నేటి వరకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రజా ప్రతినిధులను ప్రసన్నం చేసుకుంటూ,పాలకుల

అండదండలతో ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తూ అనుమతులు లేకుండా అక్రమ లేఅవుట్లు ఏర్పాటు చేసి, ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని మండి పడ్డారు. పెద్ద ఎత్తున ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా,అమాయక ప్రజలకు మాయమాటలు చెప్పి స్థలాలు విక్రయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై మేజిస్ట్రేట్ లేదా ప్రత్యేక అధికారిని నియమించాలని ఆయన డిమాండ్ చేశారు.తదుపరి విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూములను, కాపాడాలని, లేనిపక్షంలో ఈ సమస్యపై జన సమీకరణ చేసి ఉధృత పోరాటాన్ని చేస్తామని ఆయన హెచ్చరించారు.

కైకరం హైస్కూల్లో రాష్ట్రస్థాయి పోటీలు

విశాలాంధ్ర- ఉంగుటూరు: ఉంగుటూరు మండలం కైకరం హైస్కూల్లో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను బుధవారం డివైఈఓ నిమ్మగడ్డ రవీంద్ర భారతి ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే పోటీల్లో బాల బాలికల అండర్-14 విభాగంలో పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల నుంచి 650మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. లాంగ్ జంప్,హై జంప్,100,200,400 మీటర్ల పరుగు, 4,8 నాలుగు మీటర్ల అర్డిల్స్ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి అలివేలు మంగతాయారు,

నిర్వహణ అధ్యక్ష, కార్యదర్శులు గుళ్ల ప్రసాదరావు, నాగసుధ పర్యవేక్షించారు. 40 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పోటీలు నిర్వహిస్తున్నారు.

డిడియు-జికెవై స్కీం కింద ఉపాధినైపుణ్య శిక్షణ

విశాలాంధ్ర-పెదపాడు: గ్రామీణ పేద యువతకు డిమాండ్ ఉన్న నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వడం ద్వారా ఉపాధిమార్గం చూపించేం దుకు డిడియు-జికెవై శిక్షణ ఎంతో దోహదపడుతుందని కలెక్టర్ కె. వెట్రిసెల్వి పేర్కొన్నారు. బుధవారం స్థానిక వట్లూరులోని టిటిడిసి లో ఉన్న సి డాప్ శిక్షణ కేంద్రాన్ని

ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా దీనదయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్యయోజన (డిడియు-జికెవై) మరియు సి డాప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి ఏరూపాన ఏ సమాచారంతో హాజరైంది వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ ఈ కార్యక్రమం కింద 2024-25 లో 2 వేల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించా లన్నారు. ఈ సందర్భంగా శిక్షణలో ఉన్న యువతులతో స్వయంగా జిల్లా కలెక్టర్ మాట్లాడి వారి బాగోగులు, భోజన వసతి గురించి ఆరా తీశారు. కెరీర్ లక్ష్యాలపట్ల అంకిత భావం చూపుతూ వచ్చిన ఉద్యోగంతో సరిపుచ్చుకోక చదువును కొనసాగించాలని హితవు పలికారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. విజయరాజు మాట్లాడుతూ శిక్షణ పొందుతున్న వారిలో ఉపాధిహామీ పథకం కార్మికుల కుటుంబాల్లోని పిల్లలు ఉన్నారన్నారు. వీరికి శిక్షణ ఇవ్వడం ద్వారా పలు ప్రైవేట్ కార్పోరేట్ సంస్థలందు ఉపాధిఅవకాశాలు పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో పెదపాడు తహశీల్దారు కృష్ణజ్యోతి, యంపిడిఓ అమీలు జామ, జెడిఎం పార్థసారధి, ట్రైనర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు జిల్లాలో రైల్వే శాఖ పరిధిలోని సమస్యలు పరిష్కరించండి

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు: ఏలూరు జిల్లాలో రైల్వే శాఖ పరిధిలోని సమస్యలు పరిష్కరిస్తూ అభివృద్ధికి సహకరించాలని కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సతీష్ కుమార్‌కు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఢిల్లీలోని రైల్ భవన్లో

ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఏలూరు జిల్లాలో రైల్వే శాఖ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సత్తుపల్లి మీదుగా భద్రాచలం - కొవ్వూరు బ్రాడ్ గేజ్ లైన్‌కు నూతన డి.పి.ఆర్. తయారుచేసి త్వరగా పూర్తి చేయాలని తాను జూన్ 21న లేఖలో పేర్కొన్న విషయాన్ని ఎంపీ గుర్తు చేశారు. ఈ రైల్వే లైన్ కనెక్టివిటీ వల్ల విశాఖపట్నం -హైదరాబాద్‌ల మధ్య 150 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని ఎంపీ ఆయనకు వివరించారు. ఈ రైల్వే లైన్ వల్ల నాలుగు ఎస్సీ, మూడు ఎస్టీ రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రయోజనం చేకూరుతుందని ఎంపీ తెలిపారు. గుడివాడ జంక్షన్, నూజివీడు, మధిర, విస్సన్నపేట మీదుగా కొత్త రైలు మార్గాన్ని రాబోయే సాధారణ బడ్జెట్ - 2025లో మంజూరు చేయాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

విశాఖపట్నం, హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాలకు ప్రయాణించడానికి ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును నూజివీడు స్టేషన్లో ఆపాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కోరారు. భీమడోలు స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాప్ లేకపోవడంతో ద్వారక తిరుమల వెళ్లే యాత్రికులు, ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, భీమడోలు స్టేషన్‌లో జన్మభూమి రత్నాచల్, గౌతమి, షిర్డీ వంటి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేసి స్టాప్ కల్పించాలని ఎంపీ పుట్టా పుట్టా మహేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు.పల్లెవాడ రైల్వే స్టేషన్‌లో 17269/70, 17281/82 నంబర్ గల రైళ్లకు గతంలో ఉన్న హాల్ట్ ను పునరుద్ధరించాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విన్నవించారు.

ఉన్నత శిఖరాలకు ఎదగాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని బిషప్ సంతోష్ కుమార్ మానవతా సంస్థ రాష్ట్ర కన్వీనర్ బలుసు సత్యనారాయణ విద్యార్థులకు పిలుపునిచ్చారు. దేవరపల్లి మండలం పల్లంట్లలో ఎంపీపీ పాఠశాలలో బడి తర్వాత విద్యాబోధన కార్యక్రమంలో బిషప్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుండి క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని అన్నారు. ముఖ్యంగా బడి అయిన తర్వాత కూడా విద్యార్థులు విద్యపై దృష్టి పెట్టాలని ఆయన అన్నారు. మానవతా సంస్థ రాష్ట్ర కన్వీనర్ బలుసు సత్యనారాయణ మాట్లాడుతూ దేవరపల్లి మండలం మానవతా సంస్థ ఇర్ఫాన్ సంయుక్తంగా అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ దేవరపల్లి మండల ఉపాధ్యక్షుడు ఆచంట సుభాష్ చంద్రబోస్ మానవతా సంస్థ ప్రతినిధి సోమిశెట్టి వెంకట్రావు పాఠశాల హెచ్ఎం సుల్తానా, కోమలి పాల్గొన్నారు

తిక్కా తాయారుకు శ్రీనివాస్ నాయుడు సంతాపం

విశాలాంధ్ర - నిడదవోలు : నిడదవోలు మండలం విజ్జేశ్వరం గ్రామ సర్పంచ్ తిక్కా శ్రీనివాస్ మాతృమూర్తి తిక్కా తాయారు పెద కార్యం బుధ వారం నిర్వహించారు. విజ్జేశ్వరంలోని శ్రీనివాస కుటుంబాన్ని కలిసి నిడద వోలు మాజీ ఎమ్మెల్యే జి శ్రీనివాస్ నాయుడు సంతాపం తెలియచేసి తాయారు పెద కార్యం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట నిడదవోలు జడ్పీటీసి కొయ్యే సూరిబాబు,ఎంపీపీ భాగ్యలక్ష్మిదుర్గారావు, సర్పంచ్ పులిమంతుల నాగదుర్గ రామారావు,,మాజీ సొసైటీ అధ్యక్షులు యాళ్ల రామారావు,గంగాధర్ రెడ్డి, పట్టణ కౌన్సిలర్లు కామిశెట్టి సత్తిబాబు, గోపిరెడ్డి శ్రీనివాసు, వైసిపి నాయకులు ,కార్యకర్తలు పాల్గొని సంతాపం తెలిపారు.

పట్టభూముల నుంచి ఇసుక తరలింపు సరికాదు

విశాలాంధ్ర - సీతానగరం: దళితులకు చెందిన సొసైటీ పట్టభూముల నుండి ఇసుకను తర లించడం సరికాదు అని ఫీల్డ్ లేబర్ కో ఆపరేటివ్ ప్రధాన కార్యదర్శి మట్టాడి వెంకటరమణ అన్నారు. ఈ సందర్భంగా మట్టాడి వెంకటరమణ మాట్లాడుతూ ముగ్గళ్ళ ఇసుక ర్యాంపు నుండి అనుమతులు లేకుండా ఇసుక ట్రాక్టర్లు ద్వారా ఇసుకను తరలి పోవడంతో రోజు రోజుకూ భయానక వాతావరణం నెలకొంటుంది. దళితు లకు సంబంధించిన సొసైటీ భూముల్లో అక్రమంగా ఇసుక ట్రాక్టర్లు ద్వారా కావాలనే దళితుల పట్టా భూముల నుండి ఇసుకను తరలిస్తున్నారని అన్నారు. అనుమతులు ఉన్న ర్యాంపుల నుండి ఇసుకను రవాణా చేసుకోవాలి తప్ప ఇలా పట్టా భూముల్లో తరలించడం ఏమిటని ప్రశ్నించారు. సంబంధిత అధికా రులు అడ్డుకట్ట వేయకపోతే జాతీయ, రాష్ట్రంలో ఉన్న దళిత నాయకులకు తెలియజేసి న్యాయం జరిగేంత వరకు ముగ్గళ్ళ ఇసుక రాంపులో నిరసన దీక్ష చేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

రైతు భరోసా కేంద్రాల ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - చాగల్లు : తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలంలో నెలటూరు, ఊనగట్ల తదితర గ్రామాల్లో బుధవారం కలెక్టర్ ప్రశాంతి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండలంలోని ఆర్బికే కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసే విధానాలను, రైతులకు అందుతున్న తక్షణ సేవలను సిబ్బం దిని, రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేసిన ఇరవై నాలుగు గంటల్లో రైతు ఖాతాలో సొమ్ము జమ చేయబడుతుందని,ఆర్బికే కేంద్రాల్లో రైతులకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, రైతుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా యంత్రాంగం పనిచేయాలని సూచించారు. తహశీల్దార్ మెరికమ్మతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

గంధం పూజ్య బాపూజీ మృతి తీరని లోటు

విశాలాంధ్ర - కొవ్వూరు : సీనియర్ పాత్రికేయ మిత్రులు గంధం పూజ్య బాపూజీ (బాబ్జి) మరణం పాత్రికేయ రంగానికి తీరని లోటు అని కొవ్వూరు డిఎస్పి దేవకుమార్ తెలిపారు. బుధవారం సీనియర్ పాత్రికేయులు గంధం బాబ్జి సంతాప కార్యక్రమాన్ని కొవ్వూరు పట్టణంలోని వాత్సల్య వృద్ధాశ్రమ నందు నిర్వహించారు డిఎస్పి దేవకుమార్ చేతుల మీదుగా కొవ్వూరు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో వాత్సల్య వృద్ధాశ్రమంలోని వృద్ధులకు నెల రోజులకు నిత్యవసర వస్తువులు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ దేవకుమార్ మాట్లాడుతూ పాత్రికేయ రంగంలో తనకున్న భావజాలంతో అందరిని ఆకట్టుకునే తత్వం సీనియర్ పాత్రికేయ మిత్రులు గంధం పూజ బాపూజీ దని అన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నల్ల నాయుడు కార్యదర్శి ఐ న్యూస్ ప్రకాష్, కట్ట దేవదాసు, సాక్షి సత్యనారాయణ, ఈనాడు శర్మ,, పుప్పాల సురేష్, బోనగిరి అయ్యప్ప, గరగ వరప్రసాద్, సీనియర్ పాత్రికేయులు సుబ్రహ్మణ్యం, ఆర్యవైశ్య సంఘం నాయకులు మద్దుల సత్యనారాయణ, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గల్లా రాజబాబు, గౌరవ అధ్యక్షులు పోకల రవి, తదితర ప్రెస్క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది'ని రైతులు వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని రైతులు వినియోగించు కోవాలని మండల వ్యవసాయ అధికారి రాజారావు రైతులను కోరారు. బుధవారం మండలంలోని బీమోలు వేల చింతలగూడెం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ఆయా సర్పంచులు. అన్నిపు వెంకటలక్ష్మి కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయం, అనుబంధ శాఖలు పాల్గొని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి రాజారావు మాట్లాడుతూ పంటల అధిక దిగుబడులకు రైతులు తీసుకోవాల్సినటువంటి చర్యల పట్ల ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల ద్వారా రైతులకు వస్తున్న పథకాల గురించి రైతుల సమస్యల గురించి క్షుణ్ణంగా చర్చించారు.రైతులు మాట్లాడుతూ రాయితీపై రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలు , సూక్ష్మ పోషకాలను అందజేయాలని రైతులు అధికారులను కోరారు . ఈ కార్యక్రమంలో ఉద్యాన విస్తరణ అధికారి వివేక్, సిసిలి, దివ్య, సత్య కృష్ణ రైతులు,రైతు సేవ కేంద్రం సిబ్బంది ప్రకృతి వ్యవసాయం సిబ్బంది శేషగిరి పాల్గొన్నారు.

దీపం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర తూర్పుగోదావరి : మహిళా సాధికారితకు గుర్తింపు తెచ్చింది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని గోపాలపురం మండల మహిళ సమాఖ్య నూతన అధ్య క్షురాలు కాకర్ల రామ తులసి అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. నూతన అధ్యక్షురాలిగా ఎన్నికైన రామ తులసి మాట్లాడుతూ మహి ళాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చింది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలలో భాగంగా దీపం పథకం అమలు చేయడం హర్షణీయమన్నారు. ఉచిత దీపం పథకం మహిళలు సద్విని యోగం చేసుకోవాలన్నారు. నూతన కార్యవర్గానికి మహిళ సమాఖ్య అధ్యక్షురాలిగా రామతులసి, ఉపాధ్యక్షురాలుగా పాటోలు రాధిక, కార్యదర్శిగా మల్లెమొగ్గల యశోద, కోశాధికారిగా మల్లిపూడి రమాదేవి, కార్యనిర్వాహక కార్యదర్శిగా బొచ్చు మహాలక్ష్మి మండల సమాఖ్య ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర కడియం : నర్సరీలో పనిచేసే వివాహిత అత్యాచారం హత్య కేసులో నిందితులను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా త్వరితగతిన విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి తులసి, అంగన్వాడి యూనియన్ జిల్లా కార్యదర్శి బేబీ రాణి డిమాండ్ చేశారు. ఐద్వా, శ్రామిక మహిళా, ఉపాధ్యాయ, ప్రజాసంఘాల ఆధ్వ ర్యంలో కడియం బస్టాండ్ నుంచి దేవి సెంటర్ వరకు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. బాధిత మహిళ కుటుంబానికి న్యాయం చేయాలనీ, నర్సరీల్లో పనిచేసే మహిళా కార్మికులకు రక్షణ కల్పించాలని, మహిళలు చిన్నారుల రక్షణ కోసం సమగ్ర చట్టం తీసుకురావాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి పి తులసి, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి బేబీరాణి లు మాట్లాడుతూ నర్సరీలో పనిచేసే వివాహిత మహిళపై అత్యాచారం హత్య ఘట నను తీవ్రంగా ఖండించారు. నర్సరీలలో ఎక్కువ మంది మహిళలే పనిచేస్తారని, పనికి వచ్చే సమయంలో, పని ముగించుకొని ఇళ్లకు తిరిగి వెళ్లే సమయాల్లోను, పని ప్రదేశంలో కూడా వారి రక్షణకు నర్సరీ యజమానులు మరియు ప్రభుత్వం కూడా తగు భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు. బాధిత మహిళ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఇరవై ఐదు లక్షలు ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు విజయగౌరి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటలక్ష్మి, అనిత, రాజేశ్వరి, పార్వతి, చిలుకూరి శ్రీనివాస్, ఐద్వా జిల్లా అధ్యక్షులు జరీనా, సీనియర్ నాయ కులు సావిత్రి, అంగన్వాడీ యూనియన్ నాయకులు సుజాత, వెంకటలక్ష్మి, పాల్గొన్నారు.

యువతకు నైపుణ్యం గుర్తింపుపై శిక్షణ

విశాలాంధ్ర - సీతానగరం: గ్రామాల్లో యువత పలురంగాల్లో నైపుణ్యతా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఈ ఓపిఆర్డి కెవిఎస్ఎస్ఎస్ మూర్తి అన్నారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అన్ని గ్రామల సచివాలయం ఉద్యోగులకు రెండు విడతలుగా నైపుణ్య గుర్తింపు పై నైపుణ్య అభివృద్ధి కోఆర్డినేటర్ గణేష్ కుమార్, శిక్షకులు ఫణి కుమార్, ధన రాజేష్ శిక్షణ ఇచ్చారు. దీనిలో భాగంగా గ్రామాల్లో ఉన్న 19 సవంత్సరాల వయస్సు నుండి 59 సవంత్సారాల వయస్సు వారిలో వారు ఏ వృత్తిలో నైపుణ్యం కలిగి ఉన్నారో ఇంటి ఇంటికి సర్వే చేసి వారిని గుర్తించి వారి వారి నైపుణ్యాల ఆధారంగా నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. దీనిపై అధికారులు సచివాలయ ఉద్యోగులు ప్రత్యేకమైన శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శివ గోపాల్, జూనియర్ అసిస్టెంట్ సుమతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఖండవల్లి, కొత్తపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం

విశాలాంధ్ర - పెరవలి : మండలంలోని ఖండవల్లి, కొత్తపల్లి అగ్రహారం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఏ మేరీ కిరణ్ మాట్లాడుతూ రైతులకు ధాన్యం కొనుగోలుపై సందేహాలు నివృత్తి చేయడమైనది. రాబోయే దాళ్వా వరి రకాలు పై అవగాహన కల్పించామన్నారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

షష్టి మహోత్సవాలకు రాట ముహూర్తం

విశాలాంధ్ర - అనపర్తి : ఎంతో ప్రసిద్ధి గాంచిన స్థానిక వీరాజు మామిడి వద్ద గల శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద షష్టి మహోత్సవం పురస్కరించుకుని బుధవారం పందిరి రాట ముహూర్తం పూజలు చేసారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 27న స్వామి మాలాధారణ, డిసెంబర్ 5 కావిడి ఉత్సవం, 7న షష్టి మహోత్సవం, 8న మహా అన్నసమారాధన నిర్వహించనున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో ఓగిరెడ్డి సత్తిరెడ్డి, ఓగిరెడ్డి రాధ, తమలంపూడి వీర్రాఘవ రెడ్డి ఇంకా పెద్ద ఎత్తున మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మహిళ రక్షక్ పై అవగాహన కల్పించాలి : సీఐ

విశాలాంధ్ర - జగ్గంపేట : అంగన్వాడీ కేంద్రాల్లోని మహిళలకు, యుక్త వయసు బాలికలకు మీటింగ్‌లు ఏర్పాటు చేసి చట్టాలపైనా, మహిళ రక్షక్ కార్యక్రమం పైనా అవగాహన కల్పించాలని జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాసరావు సూచించారు. ఐసిడిఎస్ జగ్గంపేట ప్రాజెక్ట్ అధికారిణి ఎమ్ పూర్ణిమ ఆధ్వర్యంలో స్థానిక షాదీ ఖానా వద్ద కిర్లంపూడి, గండేపల్లి, జగ్గంపేట మండలాల్లోని అంగన్వాడీ సిబ్బంది బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ సమాజంలో మహిళలు, బాలల పట్ల జరుగుతున్న క్రైమ్ గురించి అవగాహన కల్పించారు. మహిళల రక్షణ కోసం 9494933233కు ఫోన్ చేయాలన్నారు. గ్రామాల్లో మీటింగ్‌లు ఏర్పాటు చేస్తే నేను హాజరై అందరికి అవగాహన కల్పిస్తానని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు సునీత, అమ్మాజీ బూసమ్మ, కరిమున్నీషా, నాగపర్వతి, మహిళ పోలీస్, నాగమణి, పద్మినీ ప్రియ, అంగన్వాడి కార్యకర్తలు అలివేలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి ఇంజనీరింగ్‌లో వర్క్ షాప్

విశాలాంధ్ర - గండేపల్లి : స్థానిక ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల డేటా సైన్స్ విభాగం తమ మొదటి సంవత్సర విద్యార్థిని, విద్యార్థులకు బ్రెయినోవిజన్, హైదరాబాద్ వారి సహకారంతో ఈ నెల నాలుగో తేదీ నుండి ఆరో తేదీ వరకు "బిల్డింగ్ డేటా డ్రివెన్ వెబ్సైట్స్ విత్ ఙుమీ జూరా ఖఆఅ ఔశీతీశ్రీజూతీవంం" అను అంశము పై మూడు రోజుల పాటు వర్క్ షాప్ హ్యాకథాన్ నిర్వహించామని, దీనికి ముఖ్య అతిథిగా నారాయణ స్వామి, ఎక్స్పర్ట్ ట్రైనర్, బ్రెయినోవిజన్, హైదరాబాద్ వారు విచ్చేశారని కళాశాల చైర్మన్ పరుచూరి కృష్ణారావు తెలియచేసారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ, ఈ కార్యక్రమములో విద్యార్థులు వెబ్ అప్లికేషన్స్‌లో ఉండే వివిధ ప్రక్రియలను ప్రాజెక్ట్ చేయుటకు అనుసరించవలసిన ప్రణాళికలను నిశితముగా, అనుభవ పూర్వకముగా నేర్చుకున్నారని ఇటువంటి కార్యక్రమ ములు విద్యార్థులలో సాంకేతిక ప్రతిభను పెంపొందించడానికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ముఖ్య అతిథి ఎం నారాయణ స్వామి, ఎక్స్పర్ట్ ట్రైనర్, బ్రెయినోవిజన్ మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు పెంపొందించుకోవడం ద్వారా ఉద్యోగ అవకాశాలు సాధించడానికి ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మానేజ్మెంట్ ఎంవి హరనాధబాబు, వైస్ ప్రెసిడెంట్ సతీష్, డైరెక్టర్-అకడమిక్స్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డా జి నరేష్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో రోగులకు మెరుగైన సేవలు

విశాలాంధ్ర - ఆల మూరు : ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామాల్లోనే రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అం దిస్తున్నారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ దుర్గారావు దొర అన్నారు. ఆలమూరు మండలంలోని గుమ్మిలేరు గ్రామంలో చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ సువర్చల దేవి, డాక్టర్ మల్లికార్జున రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను ఆయన బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఆయనను ముందుగా గ్రామ సర్పంచ్ గుణ్ణం రాంబాబు పూల మొక్కతో సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామ స్థాయిలోని రోగులకు వైద్య సేవలను అందించడంతో పాటు కదలలేని వారికి ఇంటికి వెళ్లి వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు.పిహెచ్‌సి పరిధిలో అధిక శాతం డెలివరీలు నమోదయ్యేటట్లు సహకరించాలన్నారు. అనంతరం గ్రామంలోని ఆరోగ్య కేంద్రంలో ఉన్న రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఈఓ జ్యోతి కుమార్, ఎమ్మెల్హెచ్‌పి జాస్మిన్, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన విలీన గ్రామాలను కలిపేందుకు కృషి

దూసర్లపూడి నిరాహార దీక్షను విరమింపజేసిన కలెక్టర్ షణ్మోహన్

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ పట్టణం పరిధిలో 8 గ్రామాల విలీనం చేయాలని కోరుతూ ప్రముఖ సామాజిక వేత్త దూసర్లపూడి రమణ రాజు నాలుగు రోజులుగా కాకినాడ కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరాహార దీక్షను బుధవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ దూసర్లపూడి రమణ రాజు చేపట్టిన నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించి, ఆయనతో చర్చించారు. ప్రభుత్వం దృష్టికి ఇదివరకే ఈ సమస్యను తీసుకువెళ్లమని, త్వరితగతిన విలీన గ్రామాలను కాకినాడ పట్టణంలో కలిపేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ కాకినాడ పట్టణానికి ఆనుకుని ఉన్న 8 గ్రామాలను కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి తీసుకువచ్చి, ఎన్నికలు నిర్వహించడంతో పాటు 2025-26 ఆర్థిక సంఘం నిధులు వెనక్కి పోకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ విలీన గ్రామాల సాధన సమితి ఆధ్వర్యంలో ప్రముఖ సామాజికవేత్త దూసర్లపూడి రమణ రాజు నిరాహారదీక్ష చేపట్టారు. ఈ అంశాన్ని ప్రభుత్వం, గౌరవ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రభుత్వ అధికారులతో చర్చించి ఈ 8 గ్రామాలను కాకినాడ పట్టణంలో విలీనం చేసేందుకు తగు చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జె వెంకటరావు, జిల్లా పౌర సంబంధాల అధికారి డి నాగార్జున, విలీన గ్రామాల సాధన సమితి సభ్యులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఐక్యరాజ్యసమితి సమావేశంలో ఎంపీ తంగెళ్ల ఉదయ్

విశాలాంధ్ర - కాకినాడ : అమెరికాలో న్యూయార్క్ నందు జరుగుతున్న 79వ ఐక్యరాజ్య సమితి సమావేశాల్లో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఐక్యరాజ్యసమితి సమావేశాల్లో పాల్గొనేందుకు వివిధ దేశాలకు చెందిన యువ ఎంపీలను సమితి ప్రతినిధులు ఆహ్వానిస్తారు. ఈ ఏడాది జరగనున్న 79వ సమావేశాలకు భారతదేశం నుండి 9 మంది ఎంపీలను ఆహ్వానించగా, అందులో కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్‌కు అవకాశం దక్కింది, గడిచిన ఎన్నికల్లో భారీ మెజారిటీతో ఎన్నికైన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ దక్షిణ భారతదేశం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలలో పిన్న వయస్కుడు. ప్రతిష్ఠాత్మక ఐక్యరాజ్య సమితి సమావేశాల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్‌ను కూటమి నాయకులు, కార్యకర్తలు ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి సమావేశాల్లో పాల్గొనడం గర్వంగా ఉందని, రాజకీయంగా అన్ని విధాల ప్రోత్సహించి ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మస్టర్ల అవినీతి ఆరోపణపై విచారణ

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామంలో కూలి పనుల మస్టర్లపై అవినీతి జరిగిందని ఆరోపణపై బుధవారం ఏపీడీ భాను ప్రకాష్ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పలపాడు గ్రామంలో సుమారు 22 మంది పేర్లపై పనులు చేయకపోయినా మస్టర్లు వేసారంటూ ఉప్పలపాడు గ్రామస్తులు కాకినాడ జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు పై వారి ఆదేశాల మేరకు బుధవారం విచారణ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. విచారించిన అనంతరం నివేదికను ఉన్నత అధికారులకు అందించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరి పైన ఆరోపించే వారితో స్టేట్మెంట్ తీసుకోంటామని చెప్పడంతో, గ్రామస్తులు ముందుగా మేము సంతకాలు చేయమని మీరే ప్రజలని అడిగి తెలుసుకోవాలనీ, లేనట్లయితే విచారణ చేపట్టొద్దని వాగ్వాదానికి దిగడంతో ఏపిడి భాను ప్రకాష్ విడివిడిగా ఒక్కొక్కరిని పిలిచి వారి స్టేట్మెంట్ రికార్డ్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో గంగాభవాని, పంచాయతీ కార్యదర్శి తరంగిణి, ఈసీ రమేష్, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు, జనసేన నాయకులు శ్రీను, సత్తి సోమరాజు, అంకం ఓంకృష్ణ పాల్గొన్నారు.

అరట్లకట్టలో భూ రీ సర్వే సదస్సులు

విశాలాంధ్ర - కరప : కరప మండల కొరిపల్లె గ్రామంలో భూ రిసర్వే సదస్సులలో 103 అర్జీలు అందాయని తహశీల్దార్ సత్యనారాయణ పేర్కొన్నారు. భూ సర్వేలో వచ్చిన ప్రతి అర్జీని తప్పనిసరిగా పరిష్కరిస్తామని తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పలివెల నాగేశ్వరరావు, మండల డిప్యూటీ తహశీల్దార్, మండల సర్వేయర్, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ రెవెన్యూ అధికారులు, తెలుగుదేశం జనసేన పార్టీ బిజెపి కూటమి సభ్యులు పాల్గొన్నారు.

సాంస్కృతిక వైభవ సదస్సును జయప్రదం చేయాలి

నన్నయ ఉపకులపతి శ్రీనివాసరావు

విశాలాంధ్ర - రాజానగరం : తమ వర్సిటీ ప్రాంగణంలో నేటి నుంచి రెండు రోజులు పాటు జరగనున్న ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం సదస్సును సమష్టిగా సహకరించి జయప్రదం చేయాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నన్నయ వర్సిటీలో ఇందుకు సంబంధించి పత్రిక ప్రకటనను బుధవారం విడుదల చేశారు. దీనిలో భాగంగా విసి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్టడీస్(కాప్స్) మధ్య జరిగిన ఎంవోయూలో భాగంగా కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో నవంబర్ 7,8 తేదీల్లో 'ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం - సదస్సు' పేరుతో సదస్సు నిర్వహిస్తున్నారన్నారు. సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమానికి జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ న్యూఢిల్లీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ హాజరవుతారని, 8వ తేదీన జరిగే ముగింపు కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టూరిజం, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ హాజ రవుతారని చెప్పారు. సదస్సుకు కన్వీనర్లుగా ఆచార్య కె శ్రీ రమేష్, ఆచార్య డి జ్యోతిర్మయి డాక్టర్ ఎన్ సుజనారాజ్ వ్యవహరిస్తున్నారన్నారు. సదస్సు నిర్వహణకు రిజిస్ట్రార్ ఆచార్య జి సుధాకర్, సెంటర్ ఫర్ ఆంధ్రప్రదేశ్ స్టడీస్(కాప్స్) ప్రెసిడెంట్ కర్రి రామారెడ్డి, సెక్రటరీ ఓలేటి సత్యనారాయణలు సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. ఈ సెమినార్‌లో ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మౌలిక అస్తిత్వాన్ని ప్రభావితం చేసే అంశాలపై పత్ర సమర్పణలు జరుగుతాయన్నారు. అవధానం, దండకం, శతకం, పద్యకవిత్వం వంటి సాహిత్య ప్రక్రియలు, కూచిపూడి, ఆంధ్రనాట్యం, దింసా గిరిజన నృత్యాలు వంటి జానపద, సాంప్రదాయ నృత్య రీతుల అవిర్భావం, విస్తృతి పై మరియు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జానపద కళారూపాలు- బుర్రకథ. హరికథ, తోలు బొమ్మలాట, తప్పెటగుళ్ళు మొదలైన సాహిత్య జానపద సంస్కృతిక అంశాలపై చర్చలు జరుగుతాయన్నారు. సాంస్కృతిక వైభవం ప్రతిబింబించే విధంగా సమష్టి కృషితో సదస్సును జయప్రదం చేయాలనీ కోరారు.

మొక్కుబడి చెల్లించిన ఎమ్మెల్యే దంపతులు

విశాలాంధ్ర - పెదపూడి : గత సార్వత్రిక ఎన్నికల్లో నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించాలని టిడిపి సీనియర్ నేత గంటా రాజు శ్రీ గౌరీ దేవికి మొక్కుకున్న మొక్కుబడి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు తీర్చడం జరిగింది. బుధవారం మండలంలోని గండ్రేడులో శ్రీ గౌరీ దేవి సంబరాలు పురస్కరించుకుని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకుని ముక్కుబడి చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

విశాలాంధ్ర - కాట్రేనికోన : చెయ్యేరు హైస్కూల్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పల్లంకుర్రు శివారు పోర పొన్నాడ గట్టుకు చెందిన పాలెపు అంజి(22) అక్కడికక్కడే మృతి చెందాడు. అమలాపురం లో రొయ్యలు కంపెనీలో పనిచేస్తున్న అంజి తన బంధువుతో కలిపి మోటార్ సైకిల్ పై ఇంటికి వెళుతుండగా చెయ్యేరు హై స్కూల్ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ, మోటార్ సైకిల్ ఢీకొట్టుకున్న ఈ ప్రమాదంలో అంజికి బలమైన గాయాలు కావడంతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. కాట్రేనికోన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగుల ఉపకరణాలకు 450 మంది ఎంపిక

విశాలాంధ్ర - రాజోలు : జిల్లా కలెక్టరు వారి ఆదేశముల ప్రకారం ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సహాయ సంస్థ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆధ్వర్యంలో ఏలిమ్‌కో సంస్థ ద్వారా అర్హులైన దివ్యాంగుల ఉపకరణాల పంపిణీ నిమిత్తం బుధవారం రాజోలు మండలం శివకోటి మంగెన గంగయ్య తెలగ కల్యాణ మండపము నందు రిజిస్ట్రేషన్ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్ సందర్శించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాజోలు నియోజకవర్గ పరిధిలోని 4 మండలాల నుండి రాజోలు 123, మలికిపురం 111, సఖినేటిపల్లి 101, మామికుదురు 115 మంది దివ్యాంగులు హాజరయ్యారు అని రాజోలు ఎంపీడీవో ఆఫీస్ మామిడిశెట్టి సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫీస్ సీఆర్వో శ్రీరామ్, సూపరింటెండెంట్ రాజు, మలికిపురం ఈఓఆర్డీ మల్లికార్జున రావు, మామిడికుదురు ఈఓపీఆర్డీ అడబాల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పురిటి బిడ్డల్ని వద్దనుకుంటే క్రాడిల్ రిసెప్షన్‌లో అప్పగించండి

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : బిడ్డలు వద్దనుకునే వారు పుట్టిన పసికందులను రోడ్డు పక్కన, చెత్తకుప్పల్లో విడిచిపెట్టకుండా బస్టాండ్లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన ఉయ్యాలలో విడిచిపెడితే బిడ్డలులేని వారికి ప్రభుత్వ పరంగా దత్తత ఇస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏలూరులోని కొత్త బస్టాండ్ లో క్రాడిల్ రిసెప్షన్ సెంటర్ ను బుధవారం ఆయన పునరుద్ధరించారు. ఈ నెల 7న గర్భస్థ శిశు దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా క్రాడిల్ రిసెప్షన్ సెంటర్, చంటి బిడ్డల తల్లులు పాలిచ్చే గదులను సందర్శించారు. ఈ సందర్భంగా కార్యదర్శి రత్న ప్రసాద్ మాట్లాడుతూ బిడ్డలు వద్దనుకునే తల్లులు ఇటువంటి ఉయ్యాలలో వారిని విడిచిపెట్టాలని సూచించారు. అనంతరం 1098 లేదా 100 మరియు 181 కాని ఫోన్ చేసి సమాచారాన్ని తెలియజేస్తే వారి సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రభుత్వానికి అప్పగించిన ఆ బిడ్డల రక్షణను అధికారులు తీసుకుంటారని, వారిని సంరక్షించి చట్ట ప్రకారం దత్తత ఇస్తారన్నారు. పౌరులు బాధ్యతతో సమాచారాన్ని అధికారులకు చేరవేయాలని సూచించారు. ఈ క్రాడిల్ రిసెప్షన్ సెంటర్లు కొత్త బస్టాండ్, గవర్నమెంట్ హాస్పిటల్ మరియు శిశు గృహలో ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ ప్రాజెక్టు డైరెక్టర్ పి.పద్మావతి, డిసిపిఓ సూర్య చక్రవేణి పాల్గొన్నారు.

చిలకాయి చెరువులో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

విశాలాంధ్ర - అమలాపురం :ఈ నెల 24, 25 తేదీలలో ముమ్మిడివరం నియోజకవర్గం కాట్రేనికోన మండలం చిలకాయి చెరువులో స్టేట్ వాలీబాల్ ప్లేయర్ మోర్త ప్రతిష్ట ఆధ్వర్యంలో నిర్వహించు ఫ్రెండ్స్ స్టేట్ లెవెల్ వాలీబాల్ టోర్నమెంట్ బ్రోచర్‌ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ఎంపి గంటి హరీష్ మాధుర్, తెలుగుదేశం పార్టీ కాట్రేనికోన మండల సీనియర్ నాయకులు వెంట్రు సుధీర్, గెద్దనపల్లి సర్పంచ్ దంతులూరి సీతారామకృష్ణరాజు ,సీనియర్ నాయకులు కంచర్ల కృష్ణ , పిన్నమరాజు రంగ రాజు, దండు వాసురాజు , ముమ్మిడివరం నగరపంచాయితీ తెలుగుదేశం పార్టీ నాయకులు భీమవరపు శ్రీనివాస్ , పల్లంకుర్రు టీడీపీ మహిళా విభాగం నాయకురాలు సాపే రూప, మెండా రాఘవ, గెద్దాడిజనర్దన్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన భాష్యం ప్రీమియర్ లీగ్ క్రికెట్ వేడుక

విశాలాంధ్ర - పిఠాపురం : రెండు రోజులుగా పిఠాపురం భాష్యం పాఠశాల ఆధ్వర్యంలో ఆర్ఆర్‌బిహెచ్ఆర్ క్రీడా ప్రాంగణం వేదికగా జరుగుతున్న భాష్యం ప్రీమియర్ లీగ్ క్రికెట వేడుక ఘనంగా ముగిసింది. కాకినాడ మరియు అంబేద్కర్ కోనసీమ జిల్లాల నుండి పది భాష్యం బ్రాంచ్‌లో పాల్గొన్న ఈ క్రికెట్ మ్యాచ్‌లో సీనియర్స్ విభాగంలో కాకినాడ శశికాంత్ నగర్ బ్రాంచ్ ప్రథమ స్థానంలో నిలవగా, రామచంద్రపురం బ్రాంచ్ రన్నర్స్‌గా నిలిచారు. జూనియర్స్ విభాగంలో జగ్గంపేట బ్రాంచ్ విన్నర్‌గా, తుని బ్రాంచ్ రన్నర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా భాష్యం జోనల్‌ఇంచార్జ్ వి గోవిందరాజు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుండి క్రికెట్‌ను కూడా భాష్యం క్రీడా విభాగంలో చేర్చామని, ఇప్పుడు జోన్లో గెలుపొందిన టీం జనవరి మాసంలో గుంటూరు వేదికగా భాష్యం రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు మెమెంటో అందజేశారు. పాఠశాల ప్రిన్సిపల్ పోలుపర్తి వేణు మాట్లాడుతూ క్రికెట్ పోటీలకు నిర్వహించడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మరియు మీడియా మిత్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ సత్యనారాయణ, భాస్కర్ శ్రీనివాస గుప్తా, దివాకర్, సూర్యారావు, అనురాధ, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో అంబేద్కర్ పాలిటెక్నిక్ కాలేజ్

విశాలాంధ్ర - యానాం : యానాం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలని అందరి సహకారంతో ప్రగతి పథంలో నడిపిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ వేల యుధం అన్నారు. స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 1996లో అప్పటి యానం ప్రజా ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కృషితో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభమైందన్నారు. అప్పటినుండి దినదినాభివృద్ధి చెందుతూ కళాశాలలో చదువుకున్నఎంతోమంది విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్ది ఉన్నత స్థాయి ఉద్యోగాలలో విదేశాలలో స్థిరపడ్డారు. అంతేకాకుండా క్యాంపస్ ఇంటర్వ్యూలో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు సత్తా చాటి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం మూడు కోర్సులు పూర్తిస్థాయిలో నడపబడుచున్నవని ఈ సందర్భంగా తెలియజేశారు.

హెవీ డ్రైవింగ్ ట్రైనీలకు సర్టిఫికెట్ల బహుకరణ

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం ఏపిఎస్ ఆర్టీసీ డిపోలో నిర్వహించుచున్న హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో తొమ్మిదో బ్యాచ్ లో 16 మంది అభ్యర్థులతో 32 రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా అమలాపురం డిపోలో సర్టిఫికెట్ల ప్రధాన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు . ఈ కార్యక్రమానికి జిల్లా రవాణా అధికారి శ్రీనివాస రావు ముఖ్య అతిధిగా విచ్చేసి అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ సిహెచ్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ ఆర్టీసీ శిక్షణ కళా శాలలో డ్రైవర్లకు ప్రాక్టికల్ శిక్షణతో పాటు బస్సు మెయింటినెన్స్ విషయంపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అతి త్వరలో పదవ బ్యాచ్ శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని ఆసక్తి గల అభ్యర్థులు డ్రైవింగ్ ఇంస్ట్రక్టర్ ఎండి రజాక్‌ను 7382909588 సంప్రదించాలని తెలియజేశారు.

600 లీటర్లు బెల్లపు ఊట ధ్వంసం

విశాలాంధ్ర-ప్రత్తిపాడు: ప్రత్తిపాడు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో నాటు సారా స్థావరాలపై నిఘా పెట్టామని ప్రత్తిపాడు ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. శివప్రసాద్ అన్నారు. కాకినాడ జిల్లా ఎక్సైజ్ సూపరిడెంట్ కృష్ణకుమారి ఆదేశాలతో ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్ పరిధిలో ఉన్న శంఖవరం మండలం రాజవరం గ్రామంలో 600 లీటర్లు బెల్లపు ఊట ను ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ పి. వంశీరామ్, ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి సిహెచ్‌సీని సందర్శించిన తుమ్మలపల్లి రమేష్

విశాలాంధ్ర - జగ్గంపేట : జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ బుధవారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శించారు. జగ్గంపేట మండలం గుర్రప్పాలెంలో మంగళవారం సాయంత్రం జరిగిన ప్రమాద సంఘటనలో గాయపడిన క్షత గాత్రులు గురించి ప్రధాన వైద్యులు ప్రణీత్‌ని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని సమస్యలను తెలియజేస్తే ఎంపి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ దృష్టికి తీసుకు వెళతానని రమేష్ చెప్పడంతో హాస్పటల్‌కు పిల్లల వైద్యులు కావాలని, స్టాఫ్ ఎన్‌హెచ్ఎంలు ముగ్గురు అవసరం అని ప్రణీత్ తెలియజేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఈ సందర్భంగా రమేష్ వైద్యులకు సూచించారు. రామవరం ఎంపిటిసి దొడ్డ శ్రీను, జనసేన పార్టీ నాయకులు సూరవ రెడ్డి నరేష్, రాజానాలశ్రీను, మాదారపు వీరబాబు, గంధం శ్రీనివాస్ ఉన్నారు.

ఆదిత్య ప్రొఫెసర్ రెహమాన్‌కు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ

విశాలాంధ్ర - గండేపల్లి : ఆదిత్య యూనివర్శిటీ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ సుందరగిరి రెహమాన్ కి ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. "ట్రాక్టర్‌తో నడిచే గ్రీన్ మరియు బ్లాక్ గ్రామ్ మినీ కంబైన్ హార్వెస్టర్‌ను అభివృద్ధి చేయడం, పనితీరు అంచనా వేయడం" అనే అంశం పై ఆయన సమర్పించిన థీసిస్ కు ప్రతిష్టాత్మకమైన ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లాం, గుంటూరు, ఆంధ్ర ప్రదేశ్ ఇటీవల డాక్టరేట్ ని ప్రకటించిందని ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్ సతీష్ రెడ్డి తెలిపారు. రెహమాన్ గత కొంత కాలంగా అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసరుగా సేవలందిస్తున్నారని సతీష్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా డా.రెహమాన్ కి విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్. శేషారెడ్డి, వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శ్రీనివాసరెడ్డి, డీన్ డాక్టర్ రమాశ్రీ, విభాగాధిపతి డాక్టర్ ఎం.వి. రాజేష్ మరియు ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఎన్ఎంఆర్ సిబ్బంది వేతనాలు పెంచుతూ జీవో విడుదల

విశాలాంధ్ర - యానాం : యానం ప్రజా పనుల శాఖలో పనిచేస్తున్న ఎమ్మార్ల జీతాలను 10,000 నుండి 18 వేలకు పెంచుతూ జీవో తొలి కాపీని పుదుచ్చేరి ప్రభుత్వం ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావుకు సీఎం రంగస్వామి ప్రజా పనుల శాఖ మంత్రి లక్ష్మీనారాయణ అందజేశారు. జీవో విడుదల పై హర్షిస్తు ముఖ్యమంత్రి రంగస్వామి, ప్రజా పనుల శాఖ మంత్రి లక్ష్మీనారాయణలను ఢిల్లీ ప్రతినిధి మల్లాడిని ఘనంగా శాలువాలతో సత్కరించారు.

విశాలాంధ్ర

గురువారం 07 నవంబరు। 2024

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక షెడ్యూల్ విడుదల

విశాలాంధ్ర - కాకినాడ : తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ప్రకటించిన దృష్ట్యా జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పత్రికా విలేకరుల సమావేశంలో సంబంధిత వివరాలను మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు గోదావరి జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసిందన్నారు. నవంబరు 11న ఎన్నికల నోటిఫికేషన్ జారీ అవుతుందన్నారు. అదే రోజునుంచి నవంబరు 18 వరకు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. ఈనెల 19వ తారీఖున నామినేషన్లు పరిశీలన ఉంటుందని, 21వ తారీఖున నామినేషన్లు ఉపసంహరణ చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. డిశంబరు 5న పోలింగ్, డిశంబరు 9న ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. ఈ దృష్ట్యా తూర్పు, పశ్చిమ గోదావరి ఉమ్మడి జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. ఎన్నికల కోడ్ ఆఫ్ కాండాక్ట్ ను(ఎంసిసి) అమలు చేయడం జరుగుతుందన్నారు. కాకినాడ జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారి ఉంటారని, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లుగా కాకినాడ డిఆర్ఓ, తూర్పుగోదావరి జిల్లా డిఆర్ఓ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా డిఆర్ఓ, పశ్చిమ గోదావరి జిల్లా డిఆర్ఓ, ఏలూరు జిల్లా డీఆర్వోలు వ్యవహరిస్తారని తెలిపారు. ఉమ్మడి తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాలో 113 మండలాలలో మొత్తం 16316 మంది ఓటర్లు ఉన్నారని అందులో పురుషులు 9674 మంది, స్త్రీలు 6642 మంది ఉన్నారని, 116 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11 మండలాలలో 12 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని 614 మంది ఓటర్లు ఉన్నారని, తూర్పు గోదావరి జిల్లాలో 19 మండలాలలో 20 పోలింగ్ కేంద్రాలు 2893 మంది ఓటర్లు , ఏలూరు జిల్లాలో 20 మండలాలలో 20 పోలింగ్ కేంద్రాలు 2605 మంది ఓటర్లు, కాకినాడ జిల్లాలో 21 మండలాలలో 22 పోలింగ్ కేంద్రాలు 3333 మంది ఓటర్లు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 22 మండలాలలో 22 పోలింగ్ కేంద్రాలు 3209 మంది ఓటర్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 20 మండలాలలో20 పోలింగ్ కేంద్రాలు 3662 మంది ఓటర్లు ఉన్నారని ఆయన తెలిపారు. ఈనెల 11వ తేదీ నుండి 18వ తేదీ వరకు కాకినాడ కలెక్టర్ కార్యాలయంలోని కోర్టు హాలులో ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 3.00 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని ఆయన తెలిపారు. టీచర్ ఎమ్మెల్సీకి సంబంధించిన ఫైనల్ ఓటర్ల జాబితాను ప్రచురించామని జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, సబ్ కలెక్టర్ కార్యాలయాలు, ఆర్డిఓ కార్యాలయాలు, తహశీల్దార్, ఎంపీ డీవో, మున్సి పల్, ఎంఈఓ, పోలింగ్ స్టేషన్లో ఈరోజు నుంచి హార్డ్ కాపీ, సాఫ్ట్ కాపీ ఉంచుతామని ఆయన తెలిపారు.

ఉమ్మడి తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి జిల్లా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్ని కలకు సంబంధించి ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఈనెల ఆరవ తేదీ వరకు అవకాశం ఉందని, ఈనెల ఆరో తేదీ వరకు నమోదు చేసుకున్న వారి జాబితా ఈనెల 23వ తేదీన ప్రచురించే డ్రాఫ్ట్ పబ్లికేషన్‌లో వారి పేర్లు ఉంటాయని తెలిపారు. ఈనెల ఏడో తేదీ నుండి 23వ తేదీ వరకు ఓటరుగా నమోదు చేసుకున్న వారి పేర్లు డిసెంబర్ 30వ తేదీన ప్రచురించే ఫైనల్ పబ్లికేషన్‌లో కనిపిస్తాయని తెలిపారు. ఎవరైనా ఓటు నమోదు చేసుకొనక పోయినట్లయితే ఈనెల 23 వరకు నమోదు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. 1-11-2024 కి మూడు సంవత్సరాల ముందు డిగ్రీ పూర్తి చేసిన వారు గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చని 15 సంవత్సరాల స్టడీ కంప్లీట్ చేసి ఉండాలని ఆయన తెలిపారు. ఉమ్మడి తూర్పు పశ్చిమగోదావరి జిల్లా జిల్లా ఇప్పటివరకు ఒక లక్ష 74 వేల 772 మంది ఓటర్లు నమోదు అయ్యారని ఆయన తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12 పోలింగ్ కేంద్రాలు, తూర్పుగోదావరి జిల్లాలో 61 పోలింగ్ కేంద్రాలు, ఏలూరు జిల్లాలో 45 పోలింగ్ కేంద్రాలు, కాకినాడ జిల్లాలో 63 పోలింగ్ కేంద్రాలు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 53 పోలింగ్ కేంద్రాలు, పశ్చిమగోదావరి జిల్లాలో 65 పోలింగ్ కేంద్రాలు మొత్తం 299 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. పట్టభద్రులు ఎవరైనా తమ ఓటు నమోదు చేసుకోక పోయినట్లయితే ఈ నెల 23వ తేదీ వరకు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ షణ్మోహన్ సగిలి సూచిం చారు. ఈ సమావేశంలో డిఆర్ఓ వెంకట్రావు, ఎన్నికల సెక్షన్ సూపరిన్టెంట్ జగన్నాధరావు పాల్గొన్నారు.

వయో వృద్ధులను గౌరవించాలి

కలెక్టర్ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: జిల్లా యంత్రాంగం వయోవృద్ధుల సమస్యలపై ఎల్లప్పుడూ బాసటగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం బ్యాంక్ కాలనీలోని శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక సమితి భవనంలో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధులు వేడుకలు-2024 సందర్భంగా ఆంధ్రప్రదేశ్ తల్లిదండ్రుల వృద్ధుల పోషణ, సంక్షేమ నియమావళి పై అవగాహన సదస్సు కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, భీమవరం నియోజకవర్గం శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తన సందేశాన్ని వినిపిస్తూ వయోవృద్ధులందరికీ తన సాష్టాంగ నమస్కారాలు తెలిపారు. తాను వృద్ధులు - తల్లిదండ్రులు పక్షపాతినని వారిపట్ల ప్రేమాభిమానాలు కలిగి బాధ్యతగా మెలగాలన్నారు. ఇంటిలోని పెద్దవారిని భారంగా భావించకుండా, మనకు వారు గౌరవంగా, అండగా ఉన్నారన్న భావంతో ఉండాలన్నారు. వృద్ధులకు ఎలాంటి సమస్య వచ్చినా అండగా నిలుస్తానని, ప్రతి సోమవారం మీకోసం కార్యక్రమంలో వృద్ధుల ద్వారా అందే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నానని తెలిపారు. భారతదేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా వృద్ధులకు రూ. 4 వేలు పింఛన్ ను అందజేసి ప్రభుత్వం వృద్ధులను ఆదుకుంటుందని తెలిపారు. చివరిగా కొంతమంది వయోవృద్ధులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, భీమవరం నియోజకవర్గ శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు పూలమాలలు వేసి, శాలువాలను కప్పి, మెమొంటోలతో సత్కరించారు. ఉచిత మెడికల్ క్యాంపును వారు సందర్శించారు. ఓమిక్స్ లేబరేటరీస్ తరచూ జిల్లా ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడి డి.రామ్ కుమార్, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం జనరల్ సెక్రటరీ బోనం పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

వార్డు సచివాలయం కలెక్టర్ తనిఖీ

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు : ఏలూరు కొత్తపేట ప్రాంతంలోని 41, 42 డివిజన్లకు సంబంధించిన వార్డు సచివాలయాన్ని బుధ వారం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సచివాలయ సిబ్బంది తమకు కేటాయించిన విధుల నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా సమర్ధవంతంగా ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు వారి పరిధిలో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ ప్రక్రియపై ఆరా తీశారు. వాటర్, ఇంటిపన్ను వసూళ్ల తీరును సంబంధిత రిజిస్టర్ ద్వారా పరిశీలించారు. వార్డుల్లో పారిశుధ్యం విషయంలో సంబంధిత సచివాలయ సిబ్బంది రోజువారీ పర్యవేక్షణ చేపట్టాలని, ప్రజల నుంచి వచ్చిన సమస్యను వెంటనే పరిష్కరించి చూపాలని తెలిపారు. వీధిలైట్ల విషయంలోకూడా సచివాలయ సిబ్బంది స్పందించి అన్నిచోట్లా వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనరు ఎ. భానుప్రతాప్, తహశీల్దారు జి.వి. శేషగిరి, డిప్యూటీ కమిషనరు శివారెడ్డి, మున్సిపల్ ఇంజనీరు సురేంద్రబాబు, డీఈ తాతబ్బాయి ఉన్నారు.

మంత్రి సుభాష్‌కు చంద్రబాబు ప్రశంసలు

విశాలాంధ్ర - అమలాపురం : మన మంచి కోరే వారే మనల్ని గుర్తిస్తారు, ప్రేమిస్తారు. వారేమన నిజమైన ఆప్తులు అని సీఎం చంద్రబాబు మరోసారి నిరూపించారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. రావయ్య సుభాష్ స్వల్ప కాలంలో ఓటరు నమోదు శాతాన్ని 90 శాతం దాటించి యువ నాయకుల సత్తా చూపించావు. అలా కసిగా పనిచేయాలి అంటూ ప్రోత్సహించారు. ఇదే దూకుడుతో పనిచేస్తే నీకు మంచి భవిష్యత్తు ఉంటుంది. అంటూ చంద్రబాబు కితాబు ఇచ్చారు. మంత్రివర్గంలో యువతకు ప్రాధాన్యత ఇచ్చింది కూడా అందుకే అంటూ ప్రశంసించారు. మంత్రి సుభాష్ రామచంద్రపురం నియోజవర్గంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను సీఎం దృష్టికి వివరించారు. కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించు కుంటామని హామీ ఇచ్చారు. సీఎం చంద్రబాబు స్పందిస్తూ రామ చంద్రపురం నియోజవర్గంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేసి,స్వల్ప కాలంలో ఊహించనిన ప్రతిభ చూపారని కితాబు నిచ్చారు

మాజీ ఎమ్మెల్యే గ్రంధీ ఇంట్లో ఐటీ సోదాలు

విశాలాంధ్ర -భీమవరం టౌన్: పశ్చిమగోదావరి జిల్లా భీమవరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఇల్లు, ఆఫీసు, కృష్ణాజిల్లా నాగాయలంక ఇతర వ్యాపార సముదాయాలపై బుధవారం ఐటీ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. గ్రంధి శ్రీనివాస్ అందుబాటులో లేరని సమాచారం. అధికారులు ఎవరిని లోపలికి అనుమతించలేదు. ఈ సోదాలు రాత్రి వరకు సాగాయి.

శ్రీ కన్నమాంబ ట్యాక్సీ ఓనర్స్ అండ్ వర్కర్స్ సంక్షేమ సంఘం

గౌరవ అధ్యక్షుడిగా కేశవభట్ల శ్రీనివాసరావు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : రాజమండ్రి రైల్వేస్టేషన్‌లో టాక్సీ ఓనర్స్, డ్రైవర్స్ ,కార్మికుల సంక్షేమానికి తన వంతు సహాయ సహకారాలతో పాటు వారి సంక్షేమానికి కృషి చేస్తానని శ్రీ కన్నమాంబ టాక్సీ ఓనర్స్ అండ్ వెల్ఫేర్ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు ,కేశవభట్ల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కేశవభట్ల శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం ఉదయం రాజమండ్రి రైల్వే స్టేషన్లో సంక్షేమ సంఘం నూతన గౌరవాధ్యక్షుడిగా నియమితులు కావడంతో టాక్సీ ఓనర్స్ అండ్ వర్కర్స్ ఘనంగా సత్కరించే కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 30 సంవత్సరాల పాటు శ్రీ కన్నమాంబ టాక్సీ ఓనర్స్ అండ్ వర్కర్స్ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులుగా స్వర్గీయ కర్రీ కృష్ణా రెడ్డి విశేష కృషి చేశారని పేర్కొన్నారు . ఆయన చూపిన మార్గంలో టాక్సీ కార్మికుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ప్రకటించారు . టాక్సీ కార్మికుల పిల్లలకు విద్య వైద్యం తదితర అంశాలలో పూర్తి సహాయ సహకా రాలు అందిస్తారని ప్రకటించారు .రైల్వే స్టేషన్ ఆవరణలో పర్యావరణ పరిరక్షణకు పలు ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించారు .ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ కార్యక్రమంలో రాజమండ్రి రైల్వే స్టేషన్ మేనేజర్ రంగనాథ్ , సీటీఐ సుంకర చంద్రమౌళి,ఆర్పీఎఫ్ ఇన్ స్పెక్టర్ సైదయ్య ,ఆర్పీఎఫ్ ఎస్ఐ లక్ష్మి ,హెల్త్ ఇన్‌స్పెక్టర్ రోహిత్, టీటీఐ సతీష్ బాబు ,ట్రస్ట్ సభ్యులు ఏవి నాగరాజు,చిటికెన సత్యనారాయణ, బండారు శ్రీనివాస రావు, సంక్షేమ సంఘం బంగారయ్య, సెక్రటరీ రమేష్, ట్యాక్సీ ఓనర్లు ,డ్రైవర్ పాల్గొన్నారు.